

## ఢిల్లీ సూపర్ విక్టరీ.. సూపర్ ఓవర్లో రాజస్తాన్ ఓటమి

క్రికెట్ ప్రేమికులకు అసలు సిసలు మజా అందింది. చివరి బంతి వరకు అత్యంత ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజేతను సూపర్ ఓవర్ ద్వారా నిర్ణయించారు. సూపర్ ఓవర్ ద్వారా మ్యాచ్ విజేతను నిర్ణయించడం నాలుగేళ్ల తర్వాత ఇదే తొలిసారి. ఈ సూపర్ ఓవర్లో ఢిల్లీ క్యాపిటల్స్ విజేతగా నిలిచింది. ఈ విజయంలో ఢిల్లీ బౌలర్ మిచెల్ స్టార్క్‌ది కీలక పాత్ర. రాజస్తాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లోనూ, సూపర్ ఓవర్లోనూ అద్భుతంగా బౌలింగ్ చేసి ఢిల్లీకి విజయాన్ని అందించాడు. సూపర్ ఓవర్లో తడబడిన రాజస్తాన్ టీమ్ పరాజయం పాలైంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఆరంభంలో పరుగులు చేయడం కష్టమైంది. అయితే అభిషేక్ పోరెల్ (49) టాప్ స్కోరర్. కేఎల్ రాహుల్ (38) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (34), అక్షర్ పటేల్ (34) కీలక పరుగులు చేశారు. దీంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసింది.


నిజామాబాద్
గురువారం
17.04.2025

సంపుటి : 15 సంచిక: 218
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

# చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక


## తదుపరి సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

- మే13తో సీజేఐ సంజీవ్ ఖన్నా పదవీ కాలం పూర్తి
- 51వ సీజేఐగా జస్టిస్ గవాయ్ మే 14న బాధ్యతలు



**చట్టం న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. న్యాయశాఖకు జస్టిస్ గవాయ్ పేరును ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫారసు చేశారు. మే 13వ తేదీతో సీజేఐ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుంది. దీంతో 51వ సీజేఐగా జస్టిస్ గవాయ్ మే 14న బాధ్యతలు చేపడతారు. కాగా, జస్టిస్ గవాయ్ సీజేఐగా 6 నెలలు కొనసాగనున్నాయి. నవంబర్‌లో ఆయన రిటైర్ కావాల్సి ఉంది. దళిత సామాజిక వర్గానికి చెందిన గవాయ్‌కు ముందు ఇదే సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ 2007లో సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలోని అమరావతికి చెందిన జస్టిస్ గవాయ్ 1985 న్యాయవాద వృత్తిలో చేరారు. మహారాష్ట్ర హైకోర్టు జడ్జి, మాజీ అడ్వకేట్ జనరల్ బారిస్టర్ రాజా భోంస్లేతో ఆయన పనిచేశారు. 1987 నుంచి 1990 వరకూ ముంబై హైకోర్టులో ఆయన సొంతంగా లా ప్రాక్టీస్ చేశారు. 1992లో నాగపూర్ బెంచ్ అసిస్టెంట్ గవర్నమెంట్ లాయర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003లో హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియమితులై 2005లో పెర్మనెంట్ జడ్జి అయ్యారు. 2019లో ఆయన సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు.

# అవినీతిలో మునిగి తేలి సిగ్గులేకుండా నిరసనలా?

- కాంగ్రెస్ ప్రభుత్వం బోఫోర్స్, 2జీ, బొగ్గు కుంభకోణం వంటి ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడింది
- నేషనల్ హెరాల్డ్ కేసులోనూ వేలకోట్లు కొల్లగొట్టాలని సోనియా, రాహుల్ చూశారు
- కోర్టుకు, ఈడీకి సహకరించాల్సింది పోయి.. దబాయించేందుకు ప్రయత్నించడమేంటి?
- మీ ధర్నాలు, నిరసన ప్రదర్శనలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు
- కంచగచ్చిబౌలిలో ఫ్లడ్‌లైట్లు పెట్టి చెట్లు నరకాల్సిన అవసరం ఏమొచ్చింది?
- రాష్ట్ర సర్కారు, కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్



**చట్టం,హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ దేశ చరిత్రలో ఎన్నో స్కాముల్లో ఉన్న విషయాన్ని మరిచి.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిరసనలు చేయడం హాస్యాస్పదమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కోర్టు, ఈడీకి సహకరించాల్సింది పోయి.. ఉల్టా ఆందోళనలు చేయడం చూసి జనం నవ్వుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. " స్వాతంత్ర్య సమరయోధులు నేషనల్ హెరాల్డ్ ను స్థాపించుకున్నారు. కానీ దొడ్డిదారిన ఈ పత్రిక ద్వారా రాహుల్, సోనియా గాంధీ కి సంబంధించిన రియల్ ఎస్టేట్ కంపెనీకి ఈ ఆస్తులను బదలాయించుకుంటున్నారు. దీనిపై విచారణ చేస్తే.. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ధర్నాలు చేపట్టడం సిగ్గుమాలిన చర్య. కాంగ్రెస్ పార్టీకి చట్టంమీద విశ్వాసం ఉంటే ఈ విధంగా ధర్నాలు చేయరు. ఈ కేసు ఇవాళ వచ్చింది కాదు. ఈ కేసును కొట్టేయాలని రాహుల్, సోనియా హైకోర్టుకు వెళ్తే.. కోర్టు కొట్టేసింది. దర్యాప్తు జరగాలని స్పష్టం చేసింది. 2016లో సుప్రీంకోర్టు కూడా సోనియా, రాహుల్ అభ్యర్థనను తోసిపుచ్చింది. మోదీ ప్రధాని అయ్యాకే ఈ కేసులు బయటకు వచ్చినట్లు.. సోనియా, రాహుల్, కాంగ్రెస్ నేతలను సుద్దపూసలు అయినట్లు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉల్టాచోర్.. అన్నట్లుగా వ్యవహరిస్తోంది"అని మండిపడ్డారు. కంచ గచ్చి బౌలి విషయంపై మాట్లాడుతూ.. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ఘటనలు.. దేశ చరిత్రలో ఎక్కడా లేవని అన్నారు. " పోలీసు బందోబస్తు పెట్టి వంద ఎకరాల్లో చెట్లు నరకడం.. పూర్తిగా కాంగ్రెస్ పార్టీ దుర్మార్గానికి అద్దం పడుతోంది. సుప్రీంకోర్టు ఇవాళ ఏం చెప్పిందో.. ప్రధానమంత్రి కూడా ఇదే మాట చెప్పారు. చెట్లు నరకడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. బీజేపీ తరపున ఈ విషయంలో అన్నిరకాలుగా ప్రయత్నించాం.. విద్యార్థులకు అండగా నిలిచాం. యువమోర్చా, మహిళామోర్చా కార్యకర్తలు ఉద్యమాలు చేశారు. జైలుపాలయ్యారు. వాల్టా చట్టం కింద చెట్లు నరకాలన్నా సర్కారరు అనుమతి తీసుకోవాలి. వంద ఎకరాల్లో చెట్లు నరికేందుకు ఎవరి అనుమతి తీసుకున్నారు"అని సర్కారును ఆయన నిలదీశారు.

## కొత్త ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**చట్టం, దుబ్బాక:** దుబ్బాక నియోజకవర్గం తోగుట మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్పెక్టర్ రవికాంత్ కి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో అంబేద్కర్ జయంతి రోజు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రజాప్రభుత్వంని కూలుస్తాం అనడం సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి నాయకులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మాజీ ఎంపీపీలు గాంధారి లత నరేందర్ రెడ్డి, గంట రవీందర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, సీనియర్ నాయకులు పాగల కొండల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, సోలిపేట ప్రసాద్, విజయ్ పాల్ రెడ్డి ,పంది రాజు, నిరంజన్ రెడ్డి, సిద్ది శ్రీనాకర్ రెడ్డి,ఓలపు నారాయణ, భారత్, జీడిపల్లి స్వామి,యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, సాజిద్ ప్రశాంత్ పాల్గొన్నారు.



## ముస్లింలు హిందూ ట్రస్టుల్లోకి వెళ్ళాలా?

- కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్న
- వక్ఫ్(సవరణ) చట్టం 2025 రాజ్యాంగబద్ధతపై కీలక విచారణ
- బెంగాల్ హింసపై ఆందోళన
- చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకు బీజేపీ పాలిత రాష్ట్రాలు
- నేడూ కొనసాగనున్న విచారణ

**చట్టం, న్యూఢిల్లీ:** వక్ఫ్(సవరణ) చట్టం 2025 రాజ్యాంగబద్ధతపై బుధవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు సంజయ్ కుమార్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పలు పిటిషన్లపై వాదనలు ఆలకించింది. ఈ చట్టం భారత రాజ్యాంగంలోని కొన్ని కీలక హక్కులను ఉల్లంఘిస్తుందని పిటిషనర్లు వాదించారు. అయితే, ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేస్తూ, ఆర్టికల్ 26 అమలును వక్ఫ్ చట్టం ఆపదని స్పష్టం చేసింది.

**ఆర్టికల్ 26 – "లౌకికత"కు సంకేతం**

సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వక్ఫ్ చట్టంలోని కొన్ని నిబంధనలు ఆర్టికల్ 26 (మతపరమైన వ్యవహారాలు నిర్వహించే హక్కు)కి వ్యతిరేకమని వాదించారు. ఆయన "వక్ఫ్ నిర్వచనంలో గత ఐదేళ్లుగా ఇస్లాం ఆచరించిన వారే ఆస్తిని వక్ఫ్ చేయగలరంటున్నారు. దీన్ని ప్రభుత్వం ఎలా నిర్ధారించగలదు? ఇది మత స్వేచ్ఛను కించపరిచే విధంగా ఉంది," అని అన్నారు. దీనిపై స్పందించిన సీజేఐ ఖన్నా, "ఆర్టికల్ 26 సార్వత్రికమైనది, అందరికీ వర్తిస్తుంది. ఇది లౌకిక రాజ్యానికి గౌరవంగా ఉంది" అని అన్నారు. కాగా వక్ఫ్ యూజర్ వ్యవహారంపై కూడా సుప్రీంకోర్టు చర్చించింది. ఢిల్లీ హైకోర్టు భవనం వక్ఫ్ భూమిపై ఉందన్న వాదనలతో పాటు, "అన్ని యూజర్ వక్ఫ్‌లు తప్పే అనడం కాదు, కానీ కొన్ని విషయంలో ఆందోళనలు తప్పవు" అని ధర్మాసనం పేర్కొంది. వినియోగదారుల ఆధారంగా ఏర్పడిన వక్ఫ్‌లను కొత్త చట్టం ప్రకారం తొలగించగలమా? అనే అంశంపై సుప్రీంకోర్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానం కోరింది.

**వివాదిత అంశాలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు**

వాదనలు సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నిస్తూ, "హిందూ ట్రస్టుల్లో ముస్లింలను చేర్చే ఉద్దేశం ఉందా?" అని అడిగింది. దీనిపై మెహతా స్పందిస్తూ, "వక్ఫ్ ట్రిబ్యునల్ ఒక న్యాయ సంస్థ, ముస్లింలను మాత్రమే కాకుండా వివిధ వర్గాలను ప్రాతినిధ్యం కల్పించేలా కొత్త చట్టం రూపొందించబడింది" అని తెలిపారు.

## రాజీవ్ యువ వికాసం స్కీంకు సహకరించండి

- దీన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దు
- మానవీయ దృష్టితో యువతకు తోడ్పడండి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలు
- టీజీ రెడ్కోతో ఎకోరేస్ ఎనర్జీ, జీపీఆర్ఎస్ ఆర్య సంస్థలు ఎంఓయూలు
- రూ.27వేల కోట్లతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఒప్పందం
- రూ. 2 వేల కోట్లతో 15 జిల్లాల్లో బయోగ్యాస్ ప్రాజెక్టులకు శ్రీకారం

**చట్టం, హైదరాబాద్:** 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లను కోరారు. మానవీయ దృష్టితో రూపొందించిన ఈ పథకానికి అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజీవ్ యువ వికాసం.. రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచిపోతుందన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన 'రాజీవ్ యువ వికాసం' స్కీంకు సంబంధించి రాష్ట్ర స్థాయి బ్యాంకర్లతో సమావేశమై మాట్లాడారు. "కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గత పదేళ్లుగా నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే.. నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా యువతకు సహాయపడేందుకు బ్యాంకర్లు సహకరించాలి. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తుంది.. బ్యాంకర్లు రూ. 1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలి" అని కోరారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ వాటా విడుదల కాగానే.. బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేసేలా చూడాలన్నారు.



**కోట్ల రూపాయల పెట్టుబడులు..**

తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీ రెడ్కో)తో ఎకోరేస్ ఎనర్జీ, జీపీఆర్ఎస్ ఆర్య సంస్థలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు ఎంవోయూలపై సంతకాలు చేశారు. రూ.27వేల కోట్లతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎకోరేస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 2 వేల కోట్లతో 15 జిల్లాల్లో బయోగ్యాస్ ప్రాజెక్టులకు జీపీఆర్ఎస్ ఆర్య ఒప్పందం చేసుకుంది.

## బడిలో విష ప్రయోగం నిందితుడి అరెస్ట్

- నిందితుడు ధర్మపురికి చెందిన వ్యక్తిగా గుర్తింపు
- ఇంట్లో వారిపై కోపంతోనే ఈ ఘాతుకం
- కేసు వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ఎస్పీ

**చట్టం, ఇచ్చోడ:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 13, 14వ తేదీల్లో సెలవు కావడంతో ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి స్కూల్ వంటగదికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని అక్కడి ఉపాధ్యాయురాలు, సిబ్బంది గమనించారు. వంటగదిలో ఉన్న ఒక బకెట్‌లో నీరు తెలుపు రంగులో ఉండటాన్ని వారు గమనించారు. అక్కడి పాత్రలను చూసి అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ.. వెంటనే గ్రామ సర్పంచి, స్థానిక పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా.. నీటిలో పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. ఉపాధ్యాయురాలు ప్రతిభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు



నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ పాఠశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ధర్మపురికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తానే పురుగుల మందు కలిపినట్లు అంగీకరించాడు. నిర్మల్‌లో ఉన్న తన సోదరుడి ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొచ్చి.. పాఠశాల వంట గది తాళాన్ని పగలగొట్టి నీటిలో కలిపినట్లు అంగీకరించాడు. కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా నిందితుడు మానసికంగా ఇబ్బందిపడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించాం. తన ఇంట్లో వారిపై ఉన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేశాం. 329(4), 324(6), 331(8), 332 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం" అని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని ఎస్పీ తెలిపారు.

## టీచర్ల సమస్యలపై పోరాడుతా

**చట్టం, పెద్దపల్లి:** టీచర్ల సమస్యలపై పోరాడుతానని బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి పెద్దపల్లి జిల్లాలో ఆయన పర్యటించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యయ సంఘం(తపస్) పెద్దపల్లి శాఖ ఆధర్యంలో స్థానిక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మల్క కొమరయ్య పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టులు సమస్యలు చెప్తారని.. సొల్యూషన్ చెప్పరన్నారు. ప్రధాని మోదీ రోజుకు 18 గంటలు పనిచేస్తూ అభివృద్ధి కోసం కష్టపడుతున్నారన్నారు. ఏ సమస్యకు అయినా పరిష్కారం ఉంటుందన్నారు. కేంద్రం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని.. దురదృష్టవశాత్తు రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేయడం లేదన్నారు. టీచర్ల సమస్యలు పెరిగే కొద్దీ యూనియన్లు పెరుగుతాయన్నారు. సీఎస్ఆర్ ఫండ్ కింద రూ.30 కోట్లతో ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మల్క కొమరయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించిందన్నారు. 'ఈ కార్యక్రమంలో నాకు బదులు.. నేనే మిమ్మల్ని సన్మానించాల్సింది. పెద్దపల్లి నుంచి నాకు మంచి మెజార్టీ ఇచ్చారు. ఎప్పటికీ మీకు కృతజ్ఞుతుడై ఉంటా. వచ్చే ఆరేళ్లలో తపస్ ను నంబర్ వన్ యూనియన్ గా తీర్చిదిద్దుతా. వచ్చే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ నుంచి అభ్యర్థిని నిలబెట్టాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరా. భవిష్యత్ లో దేశం నంబర్ వన్ గా ఎదగాలంటే విద్యావ్యవస్థ బాగుండాలి. అందుకు అనుగుణంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారం. టీచర్ల సమస్యల పరిష్కారాని తానెప్పుడు అందుబాటులో ఉంటా' అని మల్క కొమరయ్య హామీ ఇచ్చారు. అంతకుముందు పెద్దపల్లికి



చేరుకున్న మల్క కొమరయ్యకు తపస్ నాయకులు.. డప్పుచప్పుళ్ల మధ్య స్వాగతం పలికారు. గజమాలతో కొమరయ్యను సత్కరించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద విగ్రహానికి కొమరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అభయాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లిన కొమరయ్యకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు ముసుకుల సునీల్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కానుకంటి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, రాష్ట్ర సహా అధ్యక్షులు ఐలేని నరేందర్ రావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్యాల శ్రీనివాసరావు , జిల్లా గౌరవ అధ్యక్షులు పాకాల విజయేందర్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు ఎల్లం, కనకయ్య, లింగం, శ్రీనివాస్ , మల్క కాంతయ్య, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, తపస్ సభ్యులు ఉపాధ్యాయులు, ఇతర సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





▶ **తవ్వన్న ఇంట్లో బువ్వ తిన్న మంత్రి**

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో బుధవారం రోజున జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద రూ.4కోట్లతో మినీ ట్యాంక్బండ్. సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి నుండి మామిడిపల్లికి బయలు దేరారు.

**పేదోడి బియ్యంతో తవ్వన్న ఇంట్లో బువ్వ తిన్న మంత్రి!**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా పేదలకు పంపిణీ చేసిన సన్న బియ్యంతో భోజనం చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లిలో నివాసం ఉంటున్న తవ్వన్న, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్బిన్ అందాన్, ఆర్డీవో రాజు, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇంచార్జిలు పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ముత్యాల సునీల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, స్థానిక నాయకులు తవ్వన్న కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమం పేదోడి వరకు చేరుతుందో లేదో స్వయంగా వెళ్లి చూడాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో పేదల ఇంట్లో భోజనం చేసే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమం, పథకాలు పేదలకు చేరేవరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులు పనిచేయాలని మంత్రి సూచించారు. ఉమ్మడి కుటుంబంలో భోజనం చేయడం చాలా సంతోషం కలిగించిందన్నారు. సుమారు ఈ ఉమ్మడి కుటుంబంలో 70 మంది నివసిస్తున్నారని ఆయన అన్నారు. ఉమ్మడి కుటుంబాలు ఉండడం వలన అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.




**కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

మంత్రి పర్యటనలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో



ఆయన మాట్లాడుతూ, చెక్కుల పంపిణీ ఆలస్యమైనందుకు మన్నించాలని ఇకనుంచి ఈ ఆలస్యం కాకుండా మీకు దరఖాస్తు పెట్టిన నెల రోజులలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేయడం జరుగుతుందన్నారు. రెండు రోజుల్లో మూడు రోజుల్లో అతను మీకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ దరఖాస్తు చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే ఎంక్వయిరీ చేసి అధికారులకు నివేదిక అందించాలనీ అధికారులకు సూచించారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా చెక్కులను పొందాలన్నారు. ఎవరెవరికి అయితే ఈ ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ లో ఇందిరమ్మ కోడలు సోనియా గాంధీ, కొడుకు, మనవడు రాహుల్ గాంధీ, మనవరాలు ప్రియాంక గాంధీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాయకత్వంలో ఏమేమి అయితే ఎన్నికల ముందు చెప్పడం జరిగిందో వాటన్నిటినీ ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందన్నారు. అవినీతి అవకాశం లేకుండా జరగాలి 3500 ఇండ్లు అంటే ఒక్కొక్కటి ఐదు లక్షల చొప్పున ఒక ఆర్మూర్ నియోజక 170కోట్లు అయ్యాయన్నారు. అధికారులు కొన్ని వందల మంది ఉన్నారు స్పెషల్గా ఉన్నటువంటి ఆ గ్రామ వ్యవస్థ అధికారులు అర్థమే తనకు స్పెషల్ ఆఫీసర్లకు కాకుండా గ్రామానికి ఒక అధికారిని ఒకటి ఇవ్వగానే ఆ లిస్టు వాళ్ళకి ఇచ్చి ఆ గ్రామానికి మళ్లి అడుగుతా ఉన్నారా లేకపోతే ఇంట్లో ఉద్యోగం ఉన్న వ్యాపారం ఉంటాయి ఒకవేళ అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేక పోయిన వాటిని గుర్తించి నివేదిక ఇవ్వాలి. అందరికీ వస్తుందా లేదా ఒకసారి పరిశీలించి చేయండి నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికలలో వాగ్దానం మేరకు తులం బంగారం లక్ష రూపాయలు ఇస్తామన్నారు కదా మరి తులం తెచ్చిండ్రా అని అడుగుతావు నువ్వు? చెప్తా ఇప్పుడు ఈ యొక్క కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ సంబంధించి లక్ష రూపాయలు ఇస్తాము ఆ సందర్భంగా చెప్పడం జరిగింది. తులం బంగారం ఇంకా ప్రారంభించలేదన్నారు. సన్న బియ్యం ఇస్తాం అనలేదు ఆయన ఇస్తున్నాం అన్నారు. అన్ని ఇస్తాం కొంత సమయం పడుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ 4 కోట్ల నిధులు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు పర్యాటక సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావుకి ఆర్మూర్ పట్టణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి,ఆర్డీవో రాజా గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ సాయి బాబా గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, డీసీసీబీ డైరెక్టర్ వాసు, ఆర్మూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆర్మూర్ పట్టణ కౌన్సిలర్లు కాశీరాం, రవి గౌడ్, ఆకుల రాము, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖందేశ్ శ్రీను, జితేందర్, శ్యామ్ గౌడ్, గంగాధర్, వెంకట్రాం రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతనికే ఐకేపి ఆద్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** మహిళా సంఘాల బలోపేతనికే ఐకేపి ఆద్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల అధ్యక్షులు వకుల భరణం శ్రీనివాస్ అన్నారు. భుదవారం వేములవాడ రూరల్ మండలంలోని వెంకటం పల్లి, బాలరాజు పల్లి గ్రామాలలో ఐకెపి ఆద్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు వకుల భరణం శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నేదూరి రమేష్, యూత్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్, ఏపిఎం లింగయ్య, సి సి మల్లేశం, మరియు కొనుగోలు కమిటీ మహిళా సంఘం అధ్యక్షురాలు ఆసరి రజిని, సంఘ సభ్యులు మరియు డైరెక్టర్ మానుపాటి పరుశరాములు, వెలిశాల మల్లేశం, బండ బాబు, వల్లెం కనకయ్య, గురుజల గంగాధర్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు నాగుల నర్సయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ బండ గోపాల్, కాల్వ వెంకటి, మంకు మల్లయ్య, బండ రాయమల్లు, బండ మల్లేశం, ఎండి సరిపోద్దిను, నగర్ నాగరాజు, నేదురి మల్లేశం, దేవయ్య, రోడ్డ రవి, నాగుల దేవయ్య, పాశం దేవయ్య, బండ లచ్చిరెడ్డి, సాగర్ రెడ్డి, నేదురి దేవరాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ లైన్ స్కూల్ లో గ్రాడ్యుయేషన్ డే




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరంలోని ఆర్య నగర్ లో గల ఫ్యూచర్ లైన్ స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ లైన్ స్కూల్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. విద్యార్థులు తమ విద్య ప్రస్థానంలో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పూర్తిచేసుకుని ప్రైమరీ ఎడ్యుకేషన్లోకి అడుగిడుతున్న సందర్భంగా వారికి శుభాభివందనలు తెలియజేశారు. తమ పాఠశాలలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి సంపూర్ణ అభివృద్ధే ధ్యేయంగా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు నిర్విరామంగా కృషి చేస్తున్నామని అన్నారు. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులైన సహకారం కూడా ఉండాలని కోరారు. విద్యార్థి విద్యా జీవితంలో ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీ ఎడ్యుకేషన్లోకి ప్రవేశించడమంటే మొదటి మెట్టు నుంచి రెండో మెట్టుకు చేరుకోవడం లాంటిదని, కావున విద్యార్థులు క్రమశిక్షణతో ఏకాగ్రతతో చదివి ఇంకా ఉన్నత విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉంటూ వారి విద్యా ప్రయాణంలో తమవంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, సంధ్య, మాధవి, సునిత మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మెడికవర్ హాస్పిటల్ లో అరుదైన కి హోల్ వ్యాసికులర్ చికిత్స




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ మండలంలోని కాలూరు గ్రామానికి చెందిన అంజయ్య ( 53 సంవత్సరాలు) మరియు ఇందల్వాయి మండలం ఆసన్నల్లి గ్రామానికి చెందిన మల్లయ్య (50 సంవత్సరాలు) ఇద్దరు వ్యక్తులు వివిధ తేదీలలో కాళ్లల్లో తీవ్రమైన నొప్పి మానని పుండు మరియు కొద్ది దూరం కూడా నడవలేని పరిస్థితులలో హాస్పటల్ కి రావడం జరిగినది. వీరిని పరీక్షించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రవి కిరణ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ఫేరిపెరల్ యాంజియోగ్రామ్ పరీక్ష ద్వారా కాళ్ళకి సంబంధించిన రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టింది అని నిర్ధారించి స్టంట్ వేసి రక్తప్రసరణను సాధారణ స్థితికి తీసుకురావడం జరిగినది. ఇప్పుడు పేషెంట్లు ఇరువురు ఎటువంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కిరణ్ మాట్లాడుతూ ఇటువంటి ఫెరిఫరల్ ఇంటర్వెన్షన్ చికిత్స ఎటువంటి కోత లేకుండా చిన్న రంధ్రం ద్వారా చేయటం నిజామాబాద్ జిల్లాలో మొట్టమొదటిసారిగా మెడికవర్ హాస్పిటల్ నందు నిర్వహించడం జరిగినది ఎటువంటి కుట్టు కోత లేకుండా నిర్వహించటం జరిగినదని తెలిపారు. ఇటువంటి వ్యాధులు సాధారణంగా ధూమపానం చేయటం వలన రావచ్చని తెలిపారు. తరువాత సెంటర్ హెడ్ స్వామి మాట్లాడుతూ ఇటువంటి అరుదైన సర్జరీలు మెడికవర్ హాస్పిటల్ నిజామాబాద్ నందు అందుబాటులో ఉన్నవి అని తెలిపారు. వ్యాధిగ్రస్తులు హైదరాబాదు వెళ్లకుండా తక్కువ ఖర్చుతో నిజామాబాదులోనే చికిత్స పొందవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్, డి ఎం ఎస్ డాక్టర్ యజ్ఞ పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం చందుర్తి గ్రామ కమిటీ ఎన్నిక



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు మేకల పరుశురాం సూచన మేరకు మండల అధ్యక్షులు అమరబండ ప్రసాద్ ఆధ్వర్యంలో చందుర్తి గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా లింగాల మల్లయ్య, అధ్యక్షులుగా మింగని రవి, ప్రధాన కార్యదర్శిగా లోలపు శేఖర్, ఉపాధ్యక్షులుగా సిర్రం మల్లేశం, కోశా కోశాధికారిగా రాజూరి రవీందర్, కార్యదర్శిగా చిలుక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గా సుంకి శ్రీనివాస్, సోషల్ మీడియా కోఆర్డినేటర్గా కత్తి తిరుపతి, ముఖ్య సలహాదారుగా మార్త గంగాధర్, ఓరగంటి దేవయ్య, కార్యవర్గ సభ్యులుగా మట్కా దేవయ్య, సుద్దాల నరసయ్య, లింగంపల్లి వెంకటి, పులి నారాయణ, కట్ట రాములు, వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మ్యకల పరుశురాం మాట్లాడుతూ.. నూటికి 55 శాతం బీసీలకు ఇప్పటివరకు మంత్రిత్వ శాఖ లేదు, బీసీలకు ఎమ్మెల్యే స్థానాలకు ప్రత్యేక రిజర్వేషన్ స్థానాలు ఇప్పటివరకు లేవు, చట్టసభల్లో బీసీలు ఉన్నప్పుడే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తమ వాట తమకు దక్కే అవకాశాలు ఇప్పటికైనా సాధించుకుందాం అన్నారు. బీసీలంతా ఎకతాటిపైకి వచ్చి బీసీల హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్, మండల ముఖ్య సలహాదారు తిప్పని నరసయ్య, రామన్నపేట గౌరవ అధ్యక్షులు పోతరాజు నాగేశం తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ప్రభుత్వ విప్ ఆది



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ అర్బన్ మరియు రూరల్ మండలాల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును వేములవాడ నియోజకవర్గం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. బాలరాజు పల్లి గ్రామానికి చెందిన ఆసరి గౌరవకు సుమారు 70 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షులు వకలాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, సంఘ స్వామి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్ గౌడు, కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నేదురి రమేష్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎన్ నర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. మినీ ట్యాంకుబండ్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన.

## షేక్ పేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మధుకర్ రావు కి బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్




**చట్టం, హైదరాబాద్ :** షేక్ పేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ మధుకర్ రావుకి ప్రతిష్ఠాత్మక బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్ దక్కింది. టైమ్ టు గ్రో ఇన్ అసోసియేషన్ విత్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందించారు. బంజారాహిల్స్ లోని రాడిసన్ హోటల్లో 26వ ఎడ్యుకేషనల్ సమ్మిట్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ పేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ మధుకర్ రావుకు బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్ అందించారు. విద్యార్థుల గొప్ప భవిత కోసం, వారి సమగ్రాభివృద్ధి కోసం ప్రిన్సిపల్ మధుకర్ రావు చేస్తున్న కృషిని కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ప్రశంసించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ ఎం.ఎం. షరీఫ్, ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి ప్రిన్సిపల్ మధుకర్ రావుకు తమ అభినందనలు తెలియజేశారు. తమ విద్యాసంస్థలో ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న మధుకర్ రావుకు బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డ్ దక్కడం గర్వంగా ఉందని వారు తెలియజేశారు. తమ మేనేజ్ మెంట్ ఇస్తున్న సపోర్ట్, పేరెంట్స్ సహకారం వల్లే తాను ఈ అవార్డ్ అందుకోగలిగానని ప్రిన్సిపాల్ మధుకర్ రావు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్పై అధికారుల నజర్.. కబ్జాదారుల నుంచి కాపాడుకునేందుకు చర్యలు..!

**జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ నియోజక వర్గం రహమత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్లోని జీహెచ్ఎంసీ మైదానంపై కబ్జాదారుల కన్నుపడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. మైదానాన్ని ప్రజోపయోగంగా తీర్చిదిద్ది స్థానిక ప్రజలకు అందించడంతో పాటు స్థానికులకే తమ సామూహిక ఆస్తిని కాపాడుకునే బాధ్యత అప్పగించనన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి ఇక్కడ పర్యటించారు. ప్రస్తుతం 6 ఎకరాలకుపైగా ఉన్న ఈ స్థలంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భారీ స్పోర్ట్స్ స్టేడియం కానీ, అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఆహ్లాదకరమైన పార్కును కానీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు వంటి సామూహిక గృహ నిర్మాణ పథకానికి ఈ స్థలాన్ని వినియోగించవచ్చా అన్న కోణంలో కూడా ఆలోచిస్తున్నారు. అయితే ఒకప్పుడు రాతి గుట్టగా ఉన్న ఈ స్థలంలో క్రమంగా రాళ్లు తొలగించి పెద్దా లోయగా మారినప్పటికీ ఇది క్వారీ ల్యాండ్ గానే ప్రసిద్ధి పొందింది. అప్పట్లో సుమారు 10 నుంచి 15 ఎకరాలకుపైగా వున్న ఈ స్థలం తరచూ దురాక్రమణలకు గురవుతుండడంతో మిగిలిన 9 ఎకరాలకు పైగా స్థలాన్ని రెవెన్యూ నుంచి బల్దియాకు బదలాయించారు. కాగా ఈ స్థలంలోనే మరో వైపు జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఇంకా 8 ఎకరాలకు పైగా స్థలం అక్కడ మిగిలి వుండాలి. అయితే ఇప్పటికే అధికారులు ఇక్కడ కాంపౌండ్ వాల్ నిర్మించినప్పటికీ చుట్టుముట్టు ఉన్న బస్తీలను ఎరగా చేసుకుంటున్న కబ్జాదారులతో ఈ స్థలానికి ప్రమాదం పొంచి వుంది. ఈ స్థలానికి చుట్టూ బ్రహ్మ శంకర్ నగర్, ఎస్ఎస్పి నగర్, వినాయక్ నగర్, హబీబ్ ఫాతిమా నగర్ ఫేస్_2, సలీం బాబా నగర్, సంజయ్ నగర్ లు విస్తరించి వున్నాయి. సింహ భాగం 127 సర్వే నెంబర్లో వున్న ఈ స్థలం ప్రస్తుతం సుమారు 6 ఎకరాలు మాత్రమే మిగిలి వుండవచ్చని అధికారుల అంచనా. అయితే ఈ స్థలాన్ని ఇలాగే వదిలేస్తే దురాక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంటుందని భావించిన జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఈ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగా మొదట ఇక్కడ ఈ స్థలానికి జీహెచ్ఎంసీ అధికారులు పకడ్బందీగా కాంపౌండ్ వాల్ నిర్మించనున్నారు. అయితే ఏ పండుగ వచ్చినా.. ఏ కార్యక్రమం జరిగినా అందరి సామూహిక అవసరాలకు ఉపయోగ పడుతున్న ఈ స్థలాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో వేచి చూడాల్సిందే.



## విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కూల్ ఐ స్క్రీనింగ్ లో భాగంగా బడి పిల్లలకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లాలో 69,201 బడి పిల్లలకు కంటి పరీక్షలు చేయడం జరిగింది. వారిలో బాలురు 32084, బాలికలు 37117, వారిలో 55 మంది పిల్లలకు శస్త్ర చికిత్స నిమిత్తమై హైదరాబాద్ హాస్పిటల్ కు పంపడం జరిగింది వారిలో 3088 కంటి అద్దాలను సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వారందరికీ ఉచిత కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై వెంకటరమణ కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు వారి కంటిని సంరక్షించుకోవాలని ప్రతి సంవత్సరము కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించడం జరిగింది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని, స్వచ్ఛమైన నీటిని తీసుకోవాలని సూచించడం జరిగింది . ఈ కార్యక్రమంలో డిప్యూటీ DMHO డాక్టర్ జీవరాజ్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ ప్రవీణ్, డిప్యూటీ డెమో వి శ్రీనివాసులు, PMOO స్వామినాథ్ మరియు ఆర్ బి ఎస్ కే బృందము ఆర్పాల్గొన్నారు.

## నేటి నుండి భూభారతి రెవెన్యూ సదస్సు లు



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగం పేట్ పైలెట్ మండలంగా ఈ నెల 17 నుండి 30 వరకు భూభారతి రెవెన్యూ సదస్సు లు నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీఓ మన్నే ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రెవిన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు రెవిన్యూ అధికారులు సిబ్బందితో టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 17 న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు పోతాయిపల్లి బోనాల గ్రామాల్లో, 19 న బాయంపల్లి, కన్నాపూర్, 21 న పరుమళ్ళ, పోల్కంపేట్ 22 న ఎల్లారం, మెంగారం, 23 న రాంపూర్, జల్దిపల్లె, 24 న బాణాపూర్, కోర్పోల్, లింగంపల్లి, 25న భవానీపేట్, మంబాజీపేట, లింగం పేట, 26 న కంచమహల్, కొండాపూర్, 28న నల్లమడుగు, నాగారం, శెట్టి పల్లి సంగారెడ్డి, 30 న శెట్టిపల్లి, మోతె గ్రామాల్లో సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులలో యు.సురేష్ తహసీల్దార్ బృందం, ఎల్. చరణ్ సింగ్, నాయబ్ తహసీల్దార్ బృందం, రాజేశ్వర్ నాయబ్ తహసీల్దార్ బృందంలో వారి సిబ్బందితో ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

## అకాల వర్షా నికి తడిసిముద్దయిన వరిధాన్యం



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట మండలంలోని కోమటిపల్లి, అన్నారెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులు వర్షం రావడంతో ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నాలుగు గంటల ప్రాంతంలో ఈదురుగాలులో వర్షం రావడంతో కోమటిపల్లి అన్నారెడ్డిపల్లి పోతాయపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసినటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా వర్షానికి తడిసి ముద్దయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు దాన్యం తరలించి పది రోజులు గడుస్తున్న ఇప్పటివరకు తూకం ప్రారంభించలేదని రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఎండకు ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా వర్షానికి తడిసి ముద్ద కావడంతో నష్టం వాటిల్లుతుందన్నారు. ఆరబెట్టిన ధాన్యం వర్షం బారి నుండి కాపాడడానికి తార్పాల్ ఇన్ కవర్లు వేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎండిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసిపోయిందని వారన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి వెంటనే ధాన్యం తూకం ఏర్పాటు చేయాలని రైతులు కోరుచున్నారు.

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు

- పరిగి నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వము దృష్టికి తీసుకువెళ్తాం
- దశలవారీగా సమస్యల పరిష్కారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మఇండ్ల ను పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం ఆయన పరిగి శాసనసభ్యులు రాంమోహన్ రెడ్డి ల తో కలిసి పరిగి నియోజకవర్గం సుల్తాన్ పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతేకాక పరిగి మండల తహసీల్దారు కార్యాలయంలో ప్రజల నుండి పలు విజ్ఞాపనలను స్వీకరించారు. పరిగి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని సమస్యలన్నింటిని ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు. ముఖ్యంగా పరిగి నియోజకవర్గ సమస్యలను తశలవారీగా పరిష్కరించేందుకు శాసనసభ్యులు రామ మోహన్ రెడ్డి సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కలిసి తహసిల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న 100 సంవత్సరాల పైబడిన పురాతన భవనాలను పరిశీలించారు. వీటి స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి లేదా ప్రభుత్వ ఆస్తుల సక్రమ వినియోగానికి చర్యలు తీసుకున్నందుకు పూర్తి వివరాలతో సర్వే నంబర్ మ్యాపులతో కూడిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా బిసి వసతి గృహాన్ని పరిశీలించి, బియ్యము నాణ్యత ను పరిశీలించారు .మెనూ ప్రాకారమ భోజనం పెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరము ఎం పి డి ఓ కార్యాలయ ఆవరణలో ఉన్న మహిళా శక్తి క్యాంటీన్ ను, నిర్మాణంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ ను సందర్శించారు. బెష్ మెంట్ నిర్మాణానికై ఒక లక్ష రూపాయల చెక్కును ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గం మాల లక్ష్మిఅందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్టింగ్ చైర్మెన్ పరుశు రామ్ రెడ్డి, తహసిల్దార్ ఆనందరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## శ్రీ ఊర పోచమ్మ విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాధవ్



**చట్టం, బోథ్:** బోథ్ మండలంలోని కౌఠ (బి) గ్రామంలో జరిగిన శ్రీ ఊర పోచమ్మ విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహానికి తనవంతు సహాయంగా రూ. 51 వేలు అందజేశారు. గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ వీడీసీ సభ్యులు శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి స్వామి, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, సోమేశ్, రాంరెడ్డి, రమణ రెడ్డి, చిన్నా రెడ్డి, ధనుడు, లస్మన్న నెరడిగొండ మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ప్రతాప్ తో పాటు తదితరులు ఉన్నారు.

## మంత్రి సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, సమక్షంలో భాండ్లపెల్లి నరేందర్ బృందం, పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి పలువురు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని మంత్రి అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని ఆర్మూర్ నియోజక వర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలి



**చట్టం, బోథ్ :** బజార్ హత్నూర్ రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీ చెక్కులు ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పంపిణీ చేశారు. బజార్ హత్నూర్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ హాజరయి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 42 మంది లబ్ధిదారులకు రూ. 1,00,116/ చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించిన రూ. లక్ష తో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల పై దాడులు చేసిన మున్సిపల్ అధికారులు



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ పట్టణంలోని పలు హోటల్స్, బేకరీలలోని తిను బండరాలను మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పరిశీలించారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆహారం కల్తీ జరిగితే సహించేది లేదని, కల్తీ ఆహారం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వికారాబాద్ పట్టణంలోని మెట్రో బేక్ & జ్యూస్ రూ.10,000/, జీవన్ హోటల్ రూ.1000/, లక్ష్మి నరసింహ ఫుడ్ కోర్ట్ రూ.1000/, V ఫుడ్ జంక్షన్ 5000/, రాయల్ టిఫిన్ సెంటర్ 1000/, బ్రోంటో కాఫీ 1000/, జరిమానా మొత్తం రూ.19,000/విధించడం జరిగిందని అన్నారు. మంచి ఆయిల్ వాడి వంటలు వండాలని, ప్రమాదకరమైన ఫుడ్ కలర్స్ వాడొద్దని ఐఎస్ఐ ముద్ర ఉన్న వాటర్ బాటిల్స్ మాత్రమే హోటల్స్ లో అమ్మాలని సూచించడం జరిగిందన్నారు. ఎవ్వరు కూడా ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదని, అమ్మవద్దని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్, ఏసుదాసు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, జవాన్లు శంకర్, వినోద్ కుమార్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

## సన్న బియ్యం పథకంతో బీఆర్ఎస్ కి నూకలు చెల్లాయి



**చట్టం, హయత్ నగర్ :** సన్న బియ్యం పథకంతో బీఆర్ఎస్ పార్టీకి నూకలు చెల్లాయని, అందుకే ఆ పార్టీ నాయకుడు హరీష్ రావు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆరోపించారు. హయత్ నగర్ పాత గ్రామంలోని రేషన్ షాపును మధుయాష్కి బుధవారం సాయంత్రం సందర్శించారు. సన్న బియ్యం అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వారంతా కూడా సన్న బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తుండడంపై తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుంటే ఓర్వలేక నూకలు వస్తున్నాయంటూ అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీకి నూకలు చెల్లాయని బీఆర్ఎస్ పార్టీగా పేరు మార్చుకున్నారని, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి కూడా నూకలు చెల్లాయని ఎద్దేవా చేశారు. పేదలకు సన్న బియ్యం అందజేయడం నా కల అని సీఎం రేవంత్ రెడ్డి అందిస్తుంటే ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మధుయాష్కి గౌడ్ విమర్శించారు. ఎన్ని వందల కోట్లు అయినా సరే సన్న బియ్యం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ ప్రభుత్వం మంచి పని చేసినప్పుడు సమర్థించాలని సూచించారు.సన్న బియ్యం పథకంతో నిరుపేదలు ఎంతో సంతోషంగా ఉన్నారు పేదలు సంతోషంగా ఉండాలన్నదే రాహుల్, గాంధీ సోనియా గాంధీ కోరుకుంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయ వృత్తిలో పాశం సంజీవ రెడ్డి సేవలు ఎనలేనివి



**చట్టం, భూపాలపల్లి ప్రతినిది :** ఉపాధ్యాయ వృత్తిలో పాశం సంజీవ రెడ్డి సేవలు ఎనలేనివి అని డి టీ ఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ లింగా రెడ్డి అన్నారు. మహాముత్తారం మండలం ములుగు పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారిగా పని చేస్తున్న పాశం సంజీవ రెడ్డి రజిత దేవి పదవీ విరమణ అభినందన సన్మాన సభ పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు దాసరి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన లింగా రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఈ వృత్తిలో ఉన్న గౌరవం మరే వృత్తిలో లేదన్నారు. సుమారు 36 ఏళ్ల పాటు సుదీర్ఘ కాలం పాటు వివిధ పాఠశాలల్లో అంకితభావంతో పనిచేసి ఎందరో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఘనత వారికి దక్కుతుందని అన్నారు. మండల విద్యాధికారిగా నోడల్ అధికారిగా కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సమర్థ వంతంగా చేసి విద్యా రంగంలో మండలాన్ని ముందంజ లో నిలిపారని అన్నారు. ఆత్మీయ అతిథి డెమాక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంగాధర్ మాట్లాడుతూ సేవా భావమే లక్ష్యంగా పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం సంజీవ రెడ్డి ఎన్నో సేవలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ఉపాధ్యాయులు పనిచేయలన్నారు. డి టి ఎఫ్ సంఘంలో అంకితభావం గల కార్యకర్తగా వివిధ పదవుల్లో పనిచేస్తూ సంఘం బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు కార్యక్రమానికి సంజీవ రెడ్డి బంధుమిత్రులు ఉపాధ్యాయ మిత్రులు పెద్ద ఎత్తున హాజరై వారిని ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి డి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలువేరు అశోక్, ప్రధాన కార్యదర్శి ఐ త తిరుపతి, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రేగూరు సుభాకర్ రెడ్డి, కుసునపు కిరణ్ కుమార్, ఆయా మండలాల ఎం ఈ ఓ లు దేవ నాయక్, లక్షణ్, బాబు, ప్రకాష్, వెంకట్ రాజం, సి ఎం ఓ రమేష్, ఏ ఎం ఓ లక్ష్మణ్, రఘు పతి రెడ్డి, ఆరే రాకేష్ రెడ్డి, బుచ్చి రాములు, అశోక్, విజయ్ పాల్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, భూమి రెడ్డి, కృష్ణ, ఉపాధ్యాయులు అనిల్ నాయక్, సకారం నాయక్, కామిడి సతీష్ రెడ్డి, చంద్రకళ, పెనుకుల యాదగిరి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్, గీత రెడ్డి, విద్యా సాగర్ రెడ్డి, ఉమా రెడ్డి, సింధుజ, కార్తీక్ రెడ్డి, పిట్ట రాజి రెడ్డి, మానెమ్మ, లెక్కలరవీంద్ర రెడ్డి, సునీత, బంధువులు రామా దేవి, తదితరులు హాజరైనారు. సుమారు 700 మంది వరకు ఉపాధ్యాయులు బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు



**చట్టం:** తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో నోటీసులు ఇచ్చారు.

ఈ నెల 12న స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు జారీ చేసినట్లు సమాచారం. ఇన్‌స్టాగ్రామ్‌లో తప్పుడు వీడియోలు ట్యాగ్ చేసినందుకు సీనియర్ ఐఏఎస్ అధికారికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి పీఎస్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. ఇప్పటికే కంచ గచ్చి భూముల వ్యవహారంలో ఇప్పటికే పలువురికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలుస్తున్న పోలీసులు.. తాజాగా స్మితా సబర్వాల్‌కు నోటీసులు జారీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా.. మార్చి 31న హాయ్ హైదరాబాద్ అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. ఈ ఫొటో ఫేక్ ఇమేజ్‌గా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేశారు.

## పాఠశాలలోని వంట పాత్రలపై పురుగుల మందు.. నిందితుడు అరెస్టు




**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురి ప్రభుత్వ పాఠశాలలో వంట పాత్రలపై పురుగుల మందు చల్లిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఇందుకు సంబంధించిన పత్రిక ప్రకటన జారీ చేశారు. పాఠశాలకు ఆది, సోమ వారాలు సెలవు దినం కావడంతో ఉపాధ్యాయులు తాళం వేసుకొని వెళ్లారు. ధర్మపురి గోండ్ గూడ నివాసి సోయం కిస్టు అనే వ్యక్తి పాఠశాల వంటగది తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించాడు. గదిలోని వంట పాత్రతో పాటు ఒక బకెట్లో తెలుపు రంగుతో కూడిన పురుగుల మందు పోశాడు. మంగళవారం ఉదయం పాఠశాల వంటగది తాళం తీసిన ఉపాధ్యాయులకు వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం నిందితుని అరెస్టు చేశారు. నిందితుడు కిస్టు కుటుంబ కలహాల కారణంగా మానసిక ఆందోళనతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితునిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## భవిష్యత్ అంతా మనదే.. దిగులు చెందొద్దు : పటోళ్ల కార్తీక్ రెడ్డి



**(హైదరాబాద్):**, రానున్న కాలమంతా బీఆర్ఎస్‌దేనని కేసీఆర్ ఆధ్వర్యంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సులేమాన్ నగర్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముస్లిం సోదరులు ప్రధానంగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. గతంలో ఏ ప్రభుత్వం ముస్లింలను ఆర్థికంగా ఆదుకున్న దాఖలాలు లేవని, మలి విడత తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కేసీఆర్ సీఎం అయ్యాకే రాష్ట్ర అభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని ఆయన తెలిపారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాబట్టి ఎవరు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర ఏర్పాటు అనంతరం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయగా ప్రస్తుతం మాత్రం కాంగ్రెస్ నేతలు ఏడాది గడిచిన ఎలాంటి హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రధానంగా శాస్త్రి పురం సులేమాన్ నగర్ డివిజన్‌లో ముస్లింలు పేదలుగా ఉన్న ప్రాంతంలో మురికివాడలను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని గుర్తు చేశారు. ముస్లింలకు షాదీ ముబారక్ వంటి అనేక పథకాలు అమల్లోకి వచ్చిన వాటిని ప్రస్తుతం నిలిపివేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి అయినందున వరంగల్‌లో తలపెట్టిన రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని సూచించారు.

## పిఎసిఎస్ ఎరువుల గోదామును ప్రారంభించిన బోధన్ ఎమ్మెల్యే



చట్టం రెంజల్ : రెంజల్ మండలం దూపల్లి ప్రథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించబడిన అదనపు ఎరువుల గోదాములను బుధవారం మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. కల్వర్టుకు భూమి పూజ చేశారు. మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అదనపు ఎరువుల గోదాము వలన రైతులకు మరింత ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. రైతులకు అవసరమయ్యే ఎరువులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అధికారులకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బందిని ఆదేశించారు. దూపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బోధన్ ఎమ్మెల్యే పరిశీలించి మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిలిచిపోయిన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. డి 16 /2/1 కెనాల్ కు 1.5 కిలోమీటర్ వరకు సైడ్ గోడలకు సిసి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దూపల్లి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సీసీ డ్రైనేజీలు, సిసి రోడ్ల, పనులకు 10 లక్షల రూపాయలు మంజూరు చేశారు. దూపల్లి గ్రామ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేసిన మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి దూపల్లి గ్రామము తరపున నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థల అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగభూషణం రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాములు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు భూమారెడ్డి, దూపల్లి తాజా మాజీ సర్పంచ్ సాయ రెడ్డి, రెంజల్ మండలం మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జుల సాయి రెడ్డి, గ్రామ సంఘాల కార్యవర్గ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ధనుంజయ్, రెంజల్ మండల తహసిల్దార్ శ్రావణ్ కుమార్, పంచాయతి రాజ్ డి ఈ రాజయ్య, ఏఈ వినయ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. వెంకటలక్ష్మి, పి ఆర్ టి యు మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, పిఎసిఎస్ కార్యదర్శి జీవన్ రెడ్డి, రెంజల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గైని సాయిలు, పిఎసిఎస్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిభట్లలో సాండ్ బజార్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి




**చట్టం, ఇబ్రహీంపట్నం :** TGMDC ఆధ్వర్యంలో ఆదిభట్లలో ఏర్పాటుచేసిన సాండ్ బజార్ ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇల్లు కట్టుకునే వారికి సరసమైన ధరలో ఇసుక అందుబాటులో ఉంటుంధని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాండ్ బజార్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని అన్నారు. వినియోగదారులకు వీలుగా వారి అవసరాల మేరకు ఇసుక డోర్ డెలివరిని కూడా చేస్తుందన్నారు. ఎక్కడ అవినీతికి తావులేకుండా పకడ్బందీగా సాండ్ బజార్ కేంద్రాలను నిర్వహిస్తాం అన్నారు. దొడ్డు ఇసుక ప్రతి మెట్రిక్ టన్నుకు 1600 రూపాయలు, సన్న ఇసుక 1800 రూపాయలకే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి తెలిపారు. 24/7 బుకింగ్ సౌకర్యం ఉంటుందని, 365 రోజులు ఇదే ధరకు లభిస్తుందని తెలిపారు.సుమారు 1600 లారీలతో ఎక్కడకి కావలన్న ఇసుక రవాణా జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని, సన్న బియ్యం పంపిణితో పేదవాడి కడుపు నింపుతున్నామని అన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేర్చబోతున్నామని అన్నారు.త్వరలోనే రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం చేస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చటానికి సంవత్సరం ఆలస్యం అయిన విషయం వాస్తవమే అని కానీ కెసిఆర్ ప్రభుత్వం 7 లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేయటమే ఈ ఆలస్యానికి కారణమని అన్నారు.కేసిఆర్ చేసిన అప్పులకు మిత్తిలు కడుతు రాష్ట్రాన్ని అభివృద్ధి చెయ్యడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవగాహన కార్యక్రమం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని గ్రంథాలయంలో బిజెపి ఆర్మూర్ పట్టణ శాఖ అధ్యక్షులు మందుల బాలు ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర జిల్లా పార్టీ ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బిజెపి నాయకులు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ ఆకుల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, మందుల పోశెట్టి, విజయ్ ఆనంద్, పులి యుగంధర్, ఆరె రాజేశ్వర్, బాసెట్టి రాజ్ కుమార్, కందేశ్ ప్రశాంత్, ప్రసన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ప్రోగ్రాం లో ఎమ్మెల్యే గైర్హాజరు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని గుండ్ల చెరువు మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు. కార్యక్రమానికి గైర్హాజరైన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి. అందుకు బిజెపి నాయకులు మాట్లాడుతూ అనవార్య కారణాలవల్ల హాజరు కాలేకపోయారన్నారు. ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు మందుల బాలు ఆధ్వర్యంలో గుండ్ల చెరువు సందర్శించారు. అక్కడ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మాజీ కౌన్సిలర్ సుంకరి రంగన్న, దొడ్డి ప్రకాష్, పులి యుగేందర్, గుగులోత్ తిరుపతి నాయక్, కందేశ్ ప్రశాంత్, కలిగోట ప్రశాంత్, ఉదయ్ గౌడ్, ప్రసన్న గౌడ్, అల్జాపూర్ రాజేష్, రాము, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన, పరిశుభ్రతతో కూడిన నూతన మెనూ పగడ్బందీగా అమలు కావాలని దీనికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా కౌడిపల్లిలోని సమీకృత బాలికల వసతిగృహాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 105 ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు వసతి గృహాల్లో శుభ్రతలో రాజీ పడకుండా నాణ్యతతో కూడిన నూతన మెనూ పగడ్బందీగా అమలవుతుందని, కౌడిపల్లి బాలికల వసతి గృహంలో మొన్న జరిగిన సంఘటన పై స్పందించడం జరిగిందన్నారు. అస్వస్థతకు గురైన బాలికలను వసతి గృహంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు చికిత్సలు అందించడం జరిగిందని వివరించారు. ఎవరికి ఎటువంటి అపాయం లేదని వివరించారు. ఈ సంఘటనపై కలెక్టర్ స్వయంగా వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడటం జరిగింది ప్రస్తుత సౌకర్యాలు పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా మొబైల్ నెంబర్ విద్యార్థినిలకు అందించి ఎటువంటి సమస్య ఉన్న తనకు కాల్ చేయాలని చెప్పడం జరిగింది. జిల్లాలో ఇకముందు సంక్షేమ పాఠశాలలు వసతిగృహాల్లో ఇలాంటి సంఘటనలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేటట్లు వార్డెన్లకు ఆదేశించడం జరిగిందన్నారు. విద్యార్థినిలు అస్వస్థత సంఘటనపై దర్యాప్తు ముమ్మరం చేయడం జరిగిందని నివేదికల ఆధారంగా బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజాసేవ కర్తవ్యంగా ఉద్యోగులు తమ విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి, పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన విద్యా బోధన, అందించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండల కేంద్రంలో 19 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రోజున ఆలూర్ బీజేపీ మండల అధ్యక్షులు సుర శ్రీకాంత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూర్ మండల ప్రజలు ఎవరైనా అనారోగ్య రీత్యా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఖర్చులను సీఎంఆర్ ద్వారా ఇప్పిస్తామని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి అనారోగ్యంతో ఉంటే ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎల్ఓసి ఇప్పించి వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు బీజేపీ సీనియర్ నాయకులు సుభాష్, మల్లయ్య, డాక్టర్ అరుణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 17 నుంచి భూ భారతి రెవిన్యూ సదస్సు



**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** భూ భారతి రెవిన్యూ సదస్సు లింగం పేట్ పైలెట్ మండలంగా ఈ నెల 17 నుండి 30 వరకు నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఆర్డీఓ మన్నే ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రెవిన్యూ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు రెవిన్యూ అధికారులు సిబ్బందితో టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 17 న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు పోతేపల్లి, బోనాల గ్రామాల్లో, 19 న బాయంపల్లి, కన్నాపూర్, 21 న పెరుమాళ్ళ, పోలకంపేట, 22 న ఎల్లారం, మెంగారం, 23 న రాంపూర్, జల్దిపల్లె, 24 న బాణాపూర్, కోర్పోలే, లింగంపల్లి ఖుర్దూ 25న భవానీపేట్, మంబాజీపేట, లింగం పేట్, 26 న కంచమహల్, కొండాపూర్, 28న నల్లమడుగు, నగరం, శేట్పల్లి సంగారెడ్డి, 30 న శెట్పల్లి ,మోతె గ్రామాల్లో సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుల లో యు. సురేష్ తహసీల్దార్ బృందం, ఎల్. చరణ్ సింగ్, నాయబ్ తహసీల్దార్ బృందం, రాజేశ్వర్ నాయబ్ తహసీల్దార్ బృందం లలో వారి సిబ్బందితో ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం రోజు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కూతాడే ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీ నెలకు పదివేల వేతనం ఇవ్వాలని కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని స్లాబ్ రేటు పెంచాలని కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని యూనిఫామ్ డ్రెస్ కోడ్ ఇవ్వాలని ప్రతి నెల ఐదో తారీకు డబ్బులు వచ్చే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించి ఇవ్వాలని బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు ధరలు ఆకాశాన్ని అందుతున్నప్పటికిని ఇచ్చే వేతనం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే అని అన్నారు. ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేసి నెల నెల వేతనం ఇవ్వాలని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా స్వ, కార్యదర్శిగా జక్కం సుజాత, ఉపాధ్యక్షురాలు జయ, షాహిద్ సుల్తానా, దయమని, సహాయ కార్యదర్శి లక్ష్మి, కోశాధికారిగా శంకర్ ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యల సమూల పరిష్కారంకోసం భూభారతి



**చట్టం న్యూస్ లింగంపేట్ :** రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసమే భూభారతి నీ తీసుకొచ్చిందని జిల్లా దిశ కమిటీ సభ్యులు రాజు దేశముఖ బుధవారం పత్రికలకు విడుదలచిన ప్రకటనలో పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలలో పేదల భూములను రాజకీయ నాయకులు మరియు వ్యాపారవేత్తలకు బదిలీ చేయడంలో ధరణి పోర్టల్ కీలక పాత్ర పోషించిందన్నారు. ధరణి పోర్టల్ మోసం కారణంగా వేలాది మంది పేదలు తమ భూములను కోల్పోయారని పేద ప్రజల భూ సమస్యలు పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూ భారతిని తీసుకొచ్చారన్నారు., దీని ద్వారా భూ యజమానులు తమ హక్కులను కాపాడుకోవచ్చు అన్నారు. మునుపటి ధరణి పోర్టల్‌లో ఏదైనా తప్పు జరిగితే దాన్ని సరిదిద్దడానికి ఎవరూ లేరు. కానీ భూ భారతి తప్పులను సరిదిద్దడానికి అవకాశం కల్పించిందన్నారు. ఇది ఇందిరమ్మ ప్రభుత్వం, రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు.

# నూతన రోడ్డు నాణ్యతను పరిశాలించిన నారాయణ్ రావు పటేల్



**చట్టం తానూర్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని బోరీగాం గ్రామంలోని బాలాజీ గుట్ట అభివృద్ధి, దేవాలయ పున నిర్మాణం కొరకు బుధవారం రోడ్డు నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలకి పైగా నిధులు విడుదల చేసింది. ఇట్టి అభివృద్ధి పనులను బుధవారం ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్ రావు పటేల్ బోరిగాం గుట్ట రోడ్డు నిర్మాణం పనుల నాణ్యతను పరిశాలించారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా దేవాలయ అభివృద్ధి కొరకు నిధులు విడుదల చేయలేదు అని వారు మాట్లాడారు ముధోల్ నియోజకవర్గంలోని 7 మండలాల్లో దేవాలయ అభివృద్ధి పనులు చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది అని తెలియజేశారు రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి కు, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కి, జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకు ప్రజల తరుపున ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, సదశివ్ పటేల్, రామచంద్ర రెడ్డి, ముత్యం రెడ్డి, గోవింద్, అమృత్ జాడే శ్రీనివాస్ వారితో పాటు గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్**



**చట్టం, లోకేశ్వరం :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పరిధిలోని రాయాపూర్ కండ్లి గ్రామానికి తెందిన కాంగ్రెస్ పార్టీ లోకేశ్వరం మండల అధ్యక్షులు సుదర్శన్ తండ్రి ఇటీవల స్వర్గస్తులు కాగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపినా ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్ రావు వారితో పాటు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే, ముత్యం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాలూకా యూత్ అధ్యక్షులు మామ్మద్ షఫీ, సుధీర్ రెడ్డి బంక బాబు వివేక్ ప్రేమ్నాథ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మనస్థాపంతో ఆత్మహత్య



**చట్టం రామగుండం కమిషనరేట్:** గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష (26) ,M.com చదివి ఎన్ని ఎగ్జామ్ లు రాసిన జాబ్ రావడంలేదని ఇంట్లో వాళ్లకి చెబుతూ బాధపడుతూ ఉండేది, 1504 25 రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో రేకుల షెడ్డు పైపుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. తండ్రి చుంచు విటల్ ఫిర్యాదు(PG వరకు చదివి ఎన్ని పరీక్షలు రాసిన జాబ్ రావడంలేదని మనస్థాపంతో బాగా మానసిక ఒత్తిడికి లోనై తనకు తానుగా జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నది) మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని గోదావరిఖని వన్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎల్. భూమయ్య తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుంది**
- **నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిట సునీత లక్ష్మారెడ్డి**



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిట సునీత లక్ష్మారెడ్డి వరి ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నాడు వెల్దుర్తి మండల కేంద్రంలోని వరి ధాన్య కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాలు కుకునూరు, మన్నె వారి జలాల్పూర్, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి గ్రామాలలోని పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం అక్కమ్మ పల్లి గ్రామం, మహమ్మద్ నగర్ తండాలో ఐకెపి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వారు తెలియజేశారు. రైతులు పండించిన వంటి వరి పంట ప్రభుత్వమే సరసమైన ధరలకు తీసుకుంటుందని రైతులు అక్రమ దారులకు వరి ధాన్యాన్ని అమ్మకుండా నేరుగా మీకు అందుబాటులో ఉన్నటువంటి వరి ధాన్యం కేంద్రానికి తీసుకొని రావాలని రైతు లేనిదే రాజ్యం లేదని రైతుల కష్టాన్ని ప్రభుత్వం అర్థం చేసుకొని వారి శ్రమకు తగినంత ధరను ఇవ్వడం జరుగుతుందని రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నేరుగా వరి ధాన్య కేంద్రాలను సందర్శించి మీరు పండించినటువంటి వరి ధాన్యాన్ని వరి ధాన్య కేంద్రాలకు తీసుకురావాలని వరి ధాన్యం కేంద్రాలలో రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఎల్లవేళలా సందర్శించి వారికి సహకరించి వారి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించిన ధర ఏ గ్రేడ్ 2320 రూపాయలు సాధారణ రకం 2300 ల రూపాయలు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తేమ 17.0 శాతం వించరాదని చెత్త తాళ్లు 1.0 శాతం మట్టి పేల్లరాలు 1.0 శాతం చెడిపోయిన రంగు మారిన మొలకెత్తిన ధాన్యం ఐదు శాతం పూర్తిగా తయారు కాని ముడుచుకుపోయిన ధాన్యం3.0 శాతం తక్కువ రకములు మిశ్రమం6.0 శాతం రైతులు పండించిన సరుకులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రపరచి ఎవరి కల్లాల దగ్గర వారే వరి ధాన్యాన్ని ఎండబెట్టుకొని తీసుకొని రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, తాజా మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి, మెదక్ సొసైటీ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్ గౌడ్, బస్వాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్, పడిగ నరసింహులు, సొసైటీ డైరెక్టర్ రమేష్ చందర్, సొసైటీ వైస్ చైర్మన్ కర్ణ మురళి, సొసైటీ డైరెక్టర్ ఉదండపురం నరసింహులు, బిఆర్ఎస్ నాయకులు వేన్నవరం శ్రీనివాస్ రెడ్డి, నర్సాపూర్ ఆంజనేయులు, వెన్నవరం గ్యాస్ శ్రీనివాస్ రెడ్డి, చల్ల మహేష్ యాదవ్, వ్యవసాయ అధికారిని ఝాన్సీ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మజీద్, వందన, సీఈవో సిద్దయ్య అశోక్, తహసిల్దార్ కృష్ణ, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, పలు గ్రామా పంచాయతీ మాజీ సర్పంచులు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి ప్రోత్సహిస్తాం



**చట్టం, హయత్ నగర్:** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలోఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం హయత్ నగర్ టీ నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజక వర్గంలో పార్టీ పటిష్టత కోసం చేయాల్సిన కార్యక్రమాల పై చర్చించారు. డివిజన్ల వారిగా సమీక్షలు నిర్వహించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడం, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విషయాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించి వారి సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడిన కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లోనూ వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ రాజకీయాల్లో లేరని, నాయకులు కార్యకర్తలు తన రాజకీయ వారసులని పేర్కొన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కాకుండా, ఇప్పటినుంచే పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తుందని, ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నాము అనేది ప్రజలకు వివరించాలని సూచించారు. జిహెచ్ఎంసి ఎన్నికలలో పు పార్టీ పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు శ్రమించాలని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, వారి అనుచరులు చేస్తున్న అక్రమాలు ఆరోపణలను తిప్పి కొట్టాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, వచ్చే విమర్శల పైనా దీటుగా స్పందించాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అక్రమంగా దొంగ ఓట్లు నమోదు చేయించిన తీరు మొన్నటి ఎన్నికల్లో బయటపడిందని, అలాంటి విషయాలపై దృష్టి పెట్టి కార్యకర్తలు పని చేయాలన్నారు. డివిజన్ల వారీగా పర్యటనలు చేసి ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని మధుయాష్కీ పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మీద అక్రమంగా కేసులు నమోదు చేసిన తీరుపై గురువారం ఈడీ కార్యాలయం ముందు ధర్నాలో ఎల్బీ నగర్ నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. అంతే కాకుండా డివిజన్ల వారిగా జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్, సీనియర్ నేత ముద్దగొని రామ్మోహన్ గౌడ్, కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుజాత నాయక్, టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, నేలపాటి రామారావు, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి సదస్సును విజయవంతం చేయండి



**చట్టం రామగుండం :** భూ సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి తీసుకువచ్చిందని అంతర్గామ్ ఎమ్మార్వో రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి అనే కొత్త పోర్టల్ ను ప్రవేశపెట్టింది. ఈ పోర్టల్ రైతులకు, ప్రజలకు సులభతరంగా ఉండడానికి ప్రవేశపెట్టింది. ఈ పోర్టల్ ద్వారా రైతులకు అత్యంత మెరుగైన సేవలు అందుతాయని రెవెన్యూ డిపార్ట్మెంట్ తరఫున ఆశిస్తున్నామని అన్నారు. ఈ పోర్టల్ తయారు చేయడానికి అహర్నిశలు కృషి చేసిన అధికారులకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ భూభారతి పోర్టల్ గురించి రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నరన్నారు. ఇందులో భాగంగా రేపు పెద్దపెల్లి జిల్లా అంతర్గాం మండలంలో బ్రాహ్మణపల్లి రైతు వేదికలో భూ భారతి గురించి అవగాహన సదస్సు మండలంలోని ప్రజలకు రైతులకు ఏర్పాటు చేయడం జరుగుతున్నది. ఈ కార్యక్రమునకు రామగుండం శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు వస్తున్నారు. కాబట్టి రేపటి అవగాహన సదస్సు బ్రాహ్మణపల్లి రైతువేదికలో 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. భూభారతి అవగాహన సదస్సును మండలంలోని రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రమేష్ అగ్రికల్చర్ ఏవో సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 50 మీటర్ల మేర కొనసాగనున్న మట్టి తవ్వకాలు.. బండరాళ్లను తొలగించే ప్రక్రియ వేగవంతం..



**అచ్చంపేట:** శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇంకా 50 మీటర్ల పొడవు, 3 మీటర్ల ఎత్తు మేర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్‌లో మిగిలిన ఆరుగురి మృతదేహాల వెలికితీతకు 54 రోజులుగా అన్వేషణ చేస్తున్నారు. బండరాళ్లు, బురద, శిథిలాలను తొలగించే పనులు వేగవంతం చేశారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలో ఎస్ఎల్బీసీ, టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే, జేపి కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్ కుమార్ సింగ్, హైడ్రా, అధికారులు, సహాయక బృందాల ఉన్నతాధికారులతో టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు పూర్తిస్థాయిలో సమన్వయంతో సహాయక చర్యలను చేపడుతున్నట్లు, సహాయక చర్యలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన యంత్రాల ద్వారా, టన్నెల్ నిర్మాణంలో నిష్ణాతులైన అధికారుల సూచనలు, సలహాలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని వివరించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ లోపల ప్రమాదం జరిగిన రోజు నుండి నిర్విరామంగా టన్నెల్‌లో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు జరుగుతున్న సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయని, ఇంకా 50 మీటర్ల పొడవు, 3 మీటర్ల ఎత్తు మేర సహాయక చర్యలు చేపట్టాలని తెలియజేశారు. సొరంగం లోపల ఎస్క్‌వేటర్లు, బాబ్ క్యాట్లు, పెద్ద పెద్ద బండ రాళ్లను తొలగిస్తూ, కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టిని టన్నెల్ బయటకు తరలిస్తున్నట్లు, కత్తిరించిన టిబిఎం భాగాలను లోకో ట్రైన్ ద్వారా టన్నెల్ బయటికి పంపుతున్నట్లు తెలిపారు. డి వాటరింగ్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ఎప్పటికప్పుడు టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలపై నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి వివరించారు.

# గుడిమల్కాపూర్‌లో విషాదం.. వాటర్ ట్యాంక్‌పై నుంచి పడి యువకుడు మృతి

**చట్టం:** హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌లో విషాదం నెలకొంది. జలమండలి వాటర్ ట్యాంక్ ఎక్కిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. కిశోర్ కుమార్ అలియాస్ చిన్నా మామ అరుణ్ నవోదయ కాలనీలోని జలమండలి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. దీంతో మామతో కలిసి కిశోర్ అప్పుడప్పుడు జలమండలి కార్యాలయానికి వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కూడా మామ అరుణ్‌తో కలిసి కిశోర్ జలమండలి కార్యాలయానికి వచ్చాడు.

# వృత్తి పట్ల నిబద్ధతకు నిదర్శనంగా రాష్ట్ర అవార్డులు

- **ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందుకున్న ఎండి ఖాజాపాషా (కేపీ), మిద్దెల సత్యనారాయణలకు ఘన స్వాగతం**
- **జర్నలిస్టులకు శాలువాలు, జ్ఞాపికలతో ఎమ్మెల్యే శంకర్ ఘన సత్కారం**
- **జర్నలిస్టు దిర్శిణం శంకర్ రచించిన గీతాల ఆవిష్కరణకు ప్రశంసలు**



**చట్టం , షాద్ నగర్ ప్రతినిధి:** పాత్రికేయులుగా ఎన్ని ఇబ్బందులు, అవాంతరాలు ఎదురైనా, నమ్మకాలను విడనాడకుండా సత్యాన్ని ప్రజలకు అందించడమే తమ ప్రధాన లక్ష్యంగా భావించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. గతంలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పురస్కార వేడుకలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందుకున్న సీనియర్ జర్నలిస్టులు ఎండి ఖాజాపాషా (కేపీ), మిద్దెల సత్యనారాయణలను బుధవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, స్థానిక ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్రమ కేసులు భయపడకండి. ఎమ్మెల్యే శంకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ...పాత్రికేయులు తమ వృత్తిని నిర్వహిస్తున్నప్పుడు అనేక అవాంతరాలు, అక్రమ కేసులు ఎదురవుతాయి. కానీ, ఏ పరిస్థితిలోనూ సత్యాన్ని దాచకుండా ప్రజలకు సమాచారం అందించడం జర్నలిస్టుల ప్రాథమిక విధి అని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టులు కేపీ, సత్యనారాయణలు తమ వృత్తిలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిజాన్ని నిలబెట్టినందుకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం షాద్ నగర్ కు గర్వకారణమని అన్నారు. ప్రత్యేక గీతాలు ఆవిష్కరణ. ఈ సందర్భంగా, షాద్ నగర్ జర్నలిస్ట్ దిర్శనం శంకర్ రూపొందించిన రెండు ప్రత్యేక గీతాలను ఎమ్మెల్యే శంకర్ ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ కేపీకి అంకితమైన పాట, ఎమ్మెల్యే శంకర్ పేరిట రచించిన గీతం అనేకరకాల ప్రశంసలు అందుకున్నాయి. జర్నలిస్టులు సమాజంలో మార్పు తీసుకువచ్చే శక్తి. వారి అక్షర సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నయ్య, మైనార్టీ నేత ఇబ్రహీం, బ్లాక్ కాంగ్రెస్ నేత బాలరాజు గౌడ్, యువజన కాంగ్రెస్ నేత అందేమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో....



**చట్టం బిచ్కుంద:** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో అడవి ప్రాంతంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాస్. ఉపాధి హామీ కూలీలకు ఈ సందర్భంగా సూచనలు ఇస్తూ కొలతలు ప్రకారమే పనులు చేయవలెనని ఒక్కొక్కరికి రోజువారి కూలీ 307 రూపాయలు వస్తుందని తెలిపారు. ప్రతి పనిని జియో ట్యాగ్ ద్వారా లెక్కలు చేస్తారని కావున ప్రతి కూలీలు కొలతల ప్రకారమే పనిచేయగలరని ఈ సందర్భంగా సూచించారు. అలాగే ఎండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఆశా వర్కర్ నాగమణి, ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీ తో కలిసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసినారు. నిరసనగా ఉన్నచో ఓ ఆర్ ఎస్ నీళ్లలో కలుపుకొని తాగవలెనని వారిని సూచించారు.అలాగే ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నచో అందుబాటులో ఉన్న టాబ్లెట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ భరత్ ,ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు

# మెడికల్ ఏజెన్సీ ప్రారంభించిన బిచ్కుంద మఠాధిపతి సోమయప్ప స్వామి...



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మడల కేంద్రంలో నీ అంబేద్కర్ చౌరస్తా వద్ద పూలేన్ సాయిలు మెడికల్ ఏజాన్సీ ప్రారంభోత్సవం లో ముఖ్య అతిథులు గా పాల్గొన్న గౌరవ బిచ్కుంద మఠాధిపతి గురువర్యులు సోమయప్ప గారు మరియు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే గారి చేతులు మీదుగా ప్రారంభం చేయడం జరిగింది వారితో పాటు* పాల్గొన్న బిచ్కుంద మండల ex జడ్పీటీసీ సభ్యులు నల్చార్ రాజు, సొసైటి చైర్మన్ నల్చార్ బాలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కందేరావ్ పటేల్, Ex Mptc రాజు డాక్టర్, టౌన్ అధ్యక్షులు అవార్ శ్రీను, మాజీ ఎండోమెంట్ చైర్మన్ బొమ్మల లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షులు గణేష్ గౌండ, చైతన్, పోతుల అరుణ్,అనిల్, హుండే బస్వరాజు తదితరులు పాల్గొన్నరు

# నల్ల బ్యాడ్జీలు ధరించి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నిరసన

**చట్టం, రామకృష్ణాపూర్:** తాజాగా నేషనల్ హేమరల్డ్ ఈడి కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీపై ఏ1, రాహుల్ గాంధీపై ఏ2 గా కేంద్ర ప్రభుత్వం అక్రమంగా కక్షపూరిత కేసులు నమోదు చేయించారని రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో తమ అగ్ర నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయించారని ఇది పిరికిపంద చర్యగా భావిస్తూ ఖండిస్తున్నామన్నారు. గాంధీ కుటుంబం చరిష్మాను కోల్పోయే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత పదేళ్లుగా ఇదే కేసు విచారణలో ఉంది, కానీ ఇందులో ఎటువంటి అవినీతి, అక్రమంగా సంపాదించిన సంపత్తి ఉందన్న నిబంధనలపై నిర్ధారణ లేదని ఇప్పటికే పలు న్యాయస్థానాలు స్పష్టం చేశాయని తెలిపారు. ఈడి, సిబిఐ వంటి స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు వారి స్వతంత్రతను కోల్పోయి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వోద్నాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, నీలం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పుల్లూరి కళ్యాణ్, మాజీ వార్డు సభ్యులు ఉప్పాలపు సురేష్, నాయకులు బుడిగే శ్రీనివాస్, ఎర్రబెల్లి రాజేష్, బింగి శివ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల యూ డైస్ ప్లస్ వెరిఫికేషన్



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట్ మండలం లో అన్ని ప్రభుత్వ పాఠశాలలో యూ డైస్ ప్లేస్ ( డిస్టిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ పోర్టల్) వెరిఫికేషన్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు లింగంపేట్ మండలం ఏడు మంది ప్రధాన ఉపాధ్యాయులు ఐదు రోజులో వివరాలు సేకరిస్తారని మండల విద్యాధికారి షౌకత్ అలీ అన్నారు. ఇందులో భాగంగా బోనాల పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు. ప్రభుత్వ కళాశాల లో చదువుతున్న డి ఇ డి , బీఈడీ విద్యార్థులకు ఫిసికల్ వారిఫికేషన్ పై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.. వీరు పాఠశాల ఉపాధ్యాయ వివరాలు, విద్యార్థుల సంఖ్య మరియు స్కూల్ కి సంబంధించిన భౌతిక ఆట, వంట గది, తరగతి గదులు, త్రాగు నీరు, టాయిలెట్స్ కిచన్ గార్డన్, ఇతర వసతులల వివరాలు సేకరించి అధికారులకు అందిస్తారని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఇంతకుముందు ఆన్లైన్ చేసిన నమోదుకి ప్రస్తుతం చేస్తున్న ఫిసికల్ వెరిఫికేషన్ కి ఏదైనా తప్పు నమోదు అయినా వాటిని గుర్తిస్తారని యూ డైస్ ప్లేస్ లో వున్న వివరాల ఆధారంగా మరియు విద్యార్థుల నమోదు ఆధారంగానే టీచర్ సంక్షన్ పోస్ట్ లు, విద్యాలకు నోట్ బుల్స్, యూనిఫామ్, స్కూల్ గ్రాంట్, టెస్ట్ బుక్స్ మరియు ఇతర వసతులు వస్తాయని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభ రాణి, సీఆర్పీ సత్యనారాయణ, గంగాధర్, విజయ్, సంఘగౌడ్, విజయ్ ఉపాధ్యాయులు రజిని ప్రియా, స్వప్న, సాయి చందన, లింగం ఛాత్రోపాధ్యాయురాలు స్నేహ, ప్రీతీ ఇతరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసనలు




**చట్టం, బాసర :** బాసరలోని ట్రిబుల్ ఐటీ ప్రధాన గేటు వద్ద గత 8 రోజుల నుండి కళాశాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన ఎనిమిదో రోజుకు చేరింది. నిరసనలో భాగంగా, బుధవారం ప్రధాన ద్వారం వద్ద చెత్తను ఊడ్చి, తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్ని అర్హతలతో, నిబద్ధతతో గ్రామీణ విద్యార్థులకు సేవలందిస్తున్న తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ, గత వారం రోజులుగా నిరసనలు చేపడుతున్నారు. ప్రభుత్వం నుండి ఇప్పటివరకు స్పష్టమైన హామీ రాని నేపథ్యంలో, స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసనలు కొనసాగుతాయని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఉపేందర్, కృష్ణ ప్రసాద్, రాకేష్ రోషన్, రాకేష్ రెడ్డి, శంకర్, చరణ్, బాపు సింగ్, అనూష, లకుమా, స్నేహ తదితరులు తెలిపారు.

## ఈనెల 18 నుండి జొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**చట్టం, భైంసా :** ముధోల్ నియోజకవర్గంలో జొన్న పంట ఎక్కువగా సాగవుతున్న తరుణంలో రైతులకు మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హైదరాబాదులో కలిశారు. అదేవిధంగా కొనుగోలు పరిమితిని పెంచాలని కోరారు. ఎమ్మెల్యే కలిసిన వెంటనే తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని మంత్రి ఫోన్ ద్వారా అధికారులకు ఆదేశాలు జారి చేశారు. ఎకరానికి కొనుగోలు పరిమితిని పెంచాలని కోరగా ఎకరానికి 14 క్వింటాళ్ల లను కొనుగోలు చేయనున్నారు. రైతుల సౌలభ్యం కోసం మరింత పెంచాలని కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అదేవిధంగా నియోజకవర్గానికి సంబంధించిన పలుఅంశాలపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్ కు, ముఖ్యమంత్రికి, జిల్లా ఇంచార్జ్ మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు చెప్పారు.

## కోల్‌బెల్ట్ ప్రాంత అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల చేయాలి



**చట్టం రామగుండం :** DMFT (District Mineral Foundation Trust) నిధుల విడుదల కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని రామగుండం ఎమ్మెల్యే ఏం.ఎస్ రాజ్ ఠాకూర్ మరియు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కలిశారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అభివృద్ధి పనుల కోసం అవసరమైన District Mineral Foundation Trust (DMFT) నిధుల తక్షణ విడుదలను కోరుతూ, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని ఇతర ప్రాంతాల ప్రజాప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా ప్రజల ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రహదారి, ఆరోగ్యశిబిరాలు, విద్యా సౌకర్యాలు కల్పించేందుకు DMFT నిధులు అత్యంత కీలకం. ఇప్పటికే నిధులు మంజూరైనా విడుదల విషయంలో ఆలస్యం జరుగుతోంది. వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులకు సహకరించాలని" ప్రభుత్వాన్ని కోరారు. . ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ "ప్రత్యేకంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత. సంబంధిత శాఖలతో చర్చించి, త్వరితగతిన నిధుల విడుదల జరుగుతుందని" హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనింగ్ శాఖ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్‌లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి



**చట్టం/హనుమకొండ:** ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల ఎంపికలో తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సరఫరా లో ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల చేతిపంపుల మరమ్మతులను చేయించాలని అన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అర్హులైన వారి ఎంపికను ఇందిరమ్మ కమిటీతో కలిసి అధికారులు చేయాలన్నారు. మే నెల 2వ తేదీన ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు, ఆవాసాలకు తాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అధికారులు అడిగిన పలు సందేహాలకు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్ వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవోలు ఎంపివోలు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయి



**చట్టం /నడికుడ:** హనుమకొండ జిల్లా నడికుడ మండలం చర్లపల్లి గ్రామంలోని అంగన్వాడి 1,2 కేంద్రాలను బుధవారం అంగన్వాడి సూపర్వైజర్ కందుల శ్రీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా సౌత్ ఆఫ్రికా లో ఉంటున్న ఎన్ రెడ్డి మనిషా భగవాన్ రెడ్డిల ముద్దుల కూతురు హన్విక రెడ్డి బర్త్ డే సందర్భంగా చర్లపల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్ కు జారుడు బల్లను బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ జారుడుబల్లను అంగన్వాడి సూపర్వైజర్ కందుల శ్రీదేవి ఓపెనింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసి ఉల్లాసానికి దోహదపడతాయని, ఈ జారుడు బల్ల చిన్న పిల్లలకు చాలా సంతోషాన్ని కలిగిస్తుందని, క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తారని అన్నారు.

# కుభీర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరే దేన్నడో..!!

- రెండు సంవత్సరాలుగా పాలకవర్గం లేక వెలవెల పోతున్న మార్కెట్ కమిటీ
- కొనసాగుతున్న ఆశవహుల ప్రయత్నాలు
- జాప్యానికి ఎస్సీ రిజర్వేషనే కారణమా
- మండి పడుతున్న సంఘాల నాయకులు




**చట్టం, కుభీర్:** గత రెండు సంవత్సరాల నుండి కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కీ పాలకవర్గం లేక వెలవెలబోతోంది. గత ప్రభుత్వం కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించింది. అయితే గ్రూపు తగదాల వల్ల నూతన పాలకవర్గాన్ని గత ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాలపై దృష్టి పెట్టింది. పార్టీలో కష్టపడ్డ వారికి చైర్మన్ పదవులను కట్టబెట్టింది. భైంసా, నిర్మల్, సారంగాపూర్ మండలాలలో నూతన పాలకవర్గంలో అవకాశం కల్పించింది. అయితే కుభీర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు చేయడంలో కొంత జాప్యం జరుగుతోంది. తన మనిషికే ఇవ్వాలని ఒకరు.. లేదు లేదు తన కార్యకర్తకే ఇవ్వాలని మరొకరు... కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన నారాయణరావు పటేల్, బిఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసిన విఠల్ రెడ్డి ఇద్దరు కూడా ఓటమి పాలయ్యారు. అనంతరం విఠల్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇద్దరు కూడా కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్నారు. వీరిద్దరిని కాకుండా కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న ఆనంద్ రావు పటేల్ ను బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించారు. మిగిలింది కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాత్రమే ఎలాగైనా తన మనిషికే చైర్మన్ పదవి కట్ట పెట్టాలని ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. తన కార్యకర్తకే ఇవ్వాలని విఠల్ రెడ్డి.. లేదు లేదు తన మనిషికి ఇవ్వాలని నారాయణరావు పటేల్ మొండి పట్టు పడుతున్నారు. దీంతో ఎవరికి చైర్మన్ పదవి ఇవ్వాలనే దానిపై మంత్రి సీతక్కతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

**ఎస్సీ రిజర్వేషన్ కావడం వల్లే ఆలస్యం..?**

కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎస్సీ రిజర్వేషన్ కావడం తోనే గత రెండు సంవత్సరాల నుండి చైర్మన్ ను నియమించకుండా స్థానిక నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఎస్సి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అదే రిజర్వేషన్ బీసీలకు ఉంటే బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే చైర్మన్ ను నియమించే వాళ్ళని మండిపడుతున్నారు. ఎస్సీలపై చిన్నచూపు చూడకుండా వెంటనే చైర్మన్ ను నియమించాలని కోరుతున్నారు.

**తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే చైర్మన్ పదవి ఇవ్వాలి...**

కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వాలని మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేదు తమ సామాజిక వర్గానికి ఇవ్వాలని మాల సామాజిక వర్గానికి చెందిన నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి మరి డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ... "కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరే దేన్నడో " అని మండల వాసులు ఆశ్చర్యంగ ఎదురు చూస్తున్నారు.

## కంచ గచ్చిబౌలిపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు : హరీశ్‌రావు



**హైదరాబాద్ :** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైంది. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన.. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననం. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించాం. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లుగా తయారైన రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

## కంచగచ్చిబౌలిలో చెట్లను ఎలా పునరుద్ధరిస్తారు?

- చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దు
- వీకెండ్స్‌లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకు
- రాష్ట్ర సర్కారును నిలదీసిన సుప్రీం కోర్టు



**చట్టం, న్యూఢిల్లీ:** కంచగచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి వివాదంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. జంతువులు ఆశ్రయం లేక అక్కడ తిరగడం షాకింగ్‌గా ఉందని తెలిపింది. వారాంతపు సెలవుల్లో 3 రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందకు వచ్చిందని నిలదీసింది. మీరు చెట్లు నరికివేయడం వల్ల అక్కడి జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని ఈ వీడియోలు కూడా మేము చూశామని తెలిపింది. చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దని చెప్పింది. చెట్లు నరికేందుకు పర్మిషన్ తీసుకోకపోతే అధికారులను జైలుకు పంపుతామని హెచ్చరించింది. అలాగే చీఫ్ సెక్రటరీ శాంతి కుమారిని కాపాడాలనుకుంటే నరికివేసిన ఆ 100 ఎకరాల్లో చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో ఓ ప్రణాళికతో రావాలని ఆదేశించింది. చివరికి మే 15కు విచారణను వాయిదా వేసింది. స్టేటస్ కోను అలాగే కొనసాగించాలని స్పష్టం చేసింది. ''సిటీలో గ్రీన్ లంగ్ స్పేస్ ఉండాలి. చెట్ల నరికివేతకు పర్మిషన్ తీసుకున్నారా ? లేదా ? సూటిగా సమాధానం చెప్పండి. అభివృద్ధి జరగాలి.. కానీ అడవులను నాశనం చేయకూడదు. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీ లేదు. ప్రైవేట్ ఫారెస్ట్ లో చెట్లు నరికివేసినా సీరియస్‌గా తీసుకుంటాం. అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసినందుకు సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. సెల్ఫ్ సర్టిఫికెట్ చేసుకొని అన్నింటికీ మినహాయింపులు ఇచ్చుకున్నారు, ఇది సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధం. భూముల తాకట్టు అంశంతో మాకు సంబంధం లేదు. కేవలం నరికిన చెట్లను ఎలా పునరుద్ధన చేస్తారనేదే మా ప్రాధాన్యత. 1996 డిసెంబర్ లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏమాత్రం వ్యవహరించినా చూస్తూ ఊరుకోము. భూములను తాకట్టు పెట్టారా లేదా అమ్ముకున్నారో లేదో మాకు అనవసరం. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అనేది ముఖ్యం. మీరు అభివృద్ధి చేసుకోవాలనుకుంటే తగిన అనుమతులు తీసుకోండి. వంద ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలి అన్న విషయం పైనే మేము దృష్టి సారించామని'' జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

## పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణలపై సంబరాలు

**చట్టం, అమలాపురం:** కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోనే అతిపెద్ద శాఖ అయిన పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల చేపట్టిన సంస్కరణలు అభినందనీయమని జిల్లాలోని పంచాయతీ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శుల సంఘం, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ఆధ్వర్యంలో దశాబ్దాల కాలం అనంతరం సంస్కరణలకు శ్రీకారం చుట్టడం పట్ల బుధవారం కామనగరువులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. జిల్లా సంఘాల అధ్యక్షులు జి.మల్లికార్జునరావు, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజుల ఆధ్వర్యంలో తొలుత సమావేశం నిర్వహించారు. జీవోఎంఎస్ నంబరు 35లో భాగంగా పంచాయతీల విస్తరణాధికారి పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మార్పు చేయడంతో పాటు ఎంపీడీవోల పదోన్నతుల్లో విస్తరణాధికారులకు 60శాతం కోటా కల్పిస్తూ జీవో విడుదల చేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఎంపీడీవో పదోన్నతుల్లో ఏవోలకు 34శాతం అవకాశం కల్పించగా వారికి అన్యాయం జరిగిందని అనడం తగదన్నారు. గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 6 వరకు, విస్తరణాధికారుల సంఖ్యాబలం ఎక్కువగా ఉండడం వల్లనే 60శాతం వాటా కల్పించడం జరిగిందన్నారు. మండలపరిషత్, జిల్లాపరిషత్‌లలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్, ఏవోల సంఖ్యాబలం తక్కువగా ఉండడం వల్ల 34శాతం వాటా కల్పించారని వివరించారు. ఏవోలకు ఏవిధమైన అన్యాయం జరగలేదని ప్రభుత్వానికి వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. జీవో నంబరు 35పట్ల హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తూ స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ ప్రతినిధులు యు.నాగేంద్ర, ఎండీ అబ్బాస్, శెట్టిమల్లి రాజమోహన్, దుర్గాశ్రీనివాస్, రెహ్మాన్, రెడ్డిశిరీష, తేజ, కల్యాణ్, వల్లీ, అశోక్, రమ్య, మల్లేశ్వరి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## రేషన బియ్యం సీజ్



**చట్టం, పాణ్యం :** అక్రమ రేషన బియ్యం నిల్వలపై బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన డైరెక్టర్ మహేష్ నాయుడు ఆధ్వర్యంలో ఎంపీ బైరెడ్డి శబరి చేసిన ఆకస్మిక దాడుల్లో 619 బియ్యం బస్తాలు పట్టుపడ్డాయి. పాణ్యం మండ లంలోని గోరుకల్లు తండాలోని ప్రభుత్వ గోడౌనలో దాచిన 203 బస్తాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఎస్సార్బీసీ కాల్వ పక్కన ఉన్న ఒక షెడ్డులో 16 బస్తాలను, అలాగే తమ్మరాజుపల్లెలోని ఒక గోడౌనలో దాచిన 400 రేషన బియ్యం బస్తాలను గుర్తించారు. అక్రమ రేషన బియ్యాన్ని వెంటనే సీజ్ చేసి అక్రమార్కులపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మారినా వైసీపీ నాయ కుల తీరు మారలేదన్నారు.

## సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన పరకాల ఎమ్మెల్యే

- పేదవాడి కడుపు నింపేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ
- ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం/ పరకాల :** గీసుకొండ మండల కేంద్రంలో దౌడు సంపత్ రాజకుమారి సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో బుదవారం జిల్లా కలెక్టర్ సత్య శారద మరియు అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమైన నిర్ణయమని,సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.పేదలు సన్నబియ్యం తినాలనే లక్షంతోనే సన్నబియ్యం పథకం ప్రారంభించినట్లు చెప్పారు.సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. త్వరలో ఇందిరమ్మ అభయస్తం పేరుతో 9 రకాల సరుకుల కిట్లను పంపిణీ చేయబోతున్నాం అన్నారు.

## ఒక మంచి వ్యక్తిని కోల్పోయాం



**చట్టం తానుర్ :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని తానూర్ మండల పరిధిలోని కల్యాణి గ్రామ నివాసి డాక్టర్ ఆర్ కె సిరి సాగర్ స్వర్గస్థులు కాగా పండూరంగ్ శీరిసగర్ కు కలిసి వారి క్షేమ సంగతులను తెలుసుకొని ఎలా మరణించారు వాటిపై తెలుసుకున్నారు డాక్టర్ ఆర్కే సిరి సాగర్ గత 30 సంవత్సరాల క్రితం స్వయంగా ఒక దళిత జాతిలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఘనత వారికి ఉంది చాలా పేద స్థాయి నుండి వాస్తవానికి ఆ గ్రామానికి వెళ్లాలంటే ఆనాటి కాలంలో ఎటువంటి మౌలిక సదుపాయాలు బస్సు గానీ కనీసం సైకిల్ పైన వెళ్లాలంటే మార్గం లేకుంటే కానీ చదువుపై మక్కువ చూపించి ఎటికేలకు మహారాష్ట్ర లోని ఔరంగాబాద్ అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పని చేశారు వారి సేవలు అమోఘం అని కొని ఆడారు డాక్టర్ ఆర్కే శిరిశగర్ అనారోగ్య కారణము వలన ఇటీవల సోర్గస్థులు ఆయినారు వారి కుటుంబ సభ్యులకు ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే శ్రీ బోస్లే నారాయణ్ రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే, ముత్యం రెడ్డి, తానూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుండలిక్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, గోవింద్, రామచంద్ర రెడ్డి, వారితో పాటు గ్రామస్తులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్





**చట్టం /హనుమకొండ:** ఎల్కతుర్తి నుంచి మెదక్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులలో భాగంగా ముల్కనూర్ బస్టాండ్ వద్ద చేపట్టిన రహదారి నిర్మాణ పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య బుధవారం పరిశీలించారు. రహదారి పక్కనే ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం, అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. రహదారి పక్కనే కొద్ది అడుగుల దూరంలోనే ఉన్న బస్టాండ్ కార్నర్ స్థలానికి అంబేద్కర్ విగ్రహాన్ని మార్చాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల శాఖ డిఈ మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్రంథాలయానికి వసతులు ముల్కనూర్ లోని ప్రజా గ్రంథాలయంలో వసతుల కల్పనకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలోని రీడింగ్ రూమ్, కంప్యూటర్ రూమ్, పై అంతస్తును కలెక్టర్ పరిశీలించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయానికి సోలార్ పవర్ సౌకర్యంతో పాటు అదనంగా కంప్యూటర్లను కల్పిస్తామన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధంగా గ్రంథాలయంలో ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మహంకాళి స్వామి



**చట్టం రామగుండం :** రామగుండము శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశానుసారం రామగుండము మున్సిపాల్ కార్పొరేషన్ 41వ డివిజన్లో అభివృద్ధి పనులకు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేసిన మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి. ఈ కార్యక్రమములో 41వ డివిజన్ అధ్యక్షులు మీర్జా ఫజల్, ఇంచార్జ్ యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ కుడిదల శివ, జంజెర్ల అజయ్, ఉమారాణి, దేవకర్ణ, అభేద, నిషత్, భాగ్య, శారదా, సంపత్, ఖమర్, దద్దు, అబ్బు, చోటు, భాను,రాధా, అఖిల, స్వరూప, అన్వర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# నవ వధూవరులను ఆశీర్వదించిన మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ



**చట్టం కామారెడ్డి ప్రతినిధి :** ఎల్లారెడ్డి పట్టణంలోని సాయిబాబా గుడి పంతులు కుమారుని రిసెప్షన్ ముత్యాపూ రాఘవులు ఫంక్షన్ హాల్ లో ఘనంగా చేశారు. రిసెప్షన్ కి ఆహ్వానం మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సీనియర్ పాత్రికేయులు రాజేంద్రనాథ్ రిసెప్షన్ కు హాజరయ్యి నవ వధూవరులను ఆశీర్వదించారు.వారితో పాటు మాజీ ఎంపిటిసి శకావత్ అలీ,పిఎసియస్ డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి, ఆఫీస్ పటేల్, సుభాష్ టీచర్,శీనన్న, వెంకటేశం, పుండరీ వెంకటేశం, ఓరా వెంకటేశం,ఎర్ర శీనన్న ప్రమోద్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ పరిధిలోని కీర్తినగర్ లో స్థానిక సమస్యలపై పర్యటించిన కార్పొరేటర్..



**చట్టం / పరకాల :** వరంగల్ మహానగర పాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్ శానిటేషన్ మరియు వాటర్ సప్లయ్ సమస్యలపై కీర్తి నగర్ లో స్థానిక కార్పొరేటర్ సుంకరి.మనీషా శివకుమార్ పర్యటించి మున్సిపల్ వాటర్ మెన్ కు మున్సిపల్ శానిటరీ జవాన్ కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని వాటర్ సప్లయ్ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ముందస్తుగా తెలియజేయడం వల్ల సమస్య తొందరగా పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని అన్నారు.. అనంతరం కాలనీ లో ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లు మరియు పిచ్చి చెట్లను జెసిబి సహాయంతో తొలగించే పనులను పరిశీలించడం జరిగింది అన్నారు.

# ప్రభుత్వ పథకాల పేరుతో దళారుల మోసాన్ని సహించం



**చట్టం ధర్పల్లి:** ప్రభుత్వా పథకాల పేరుతో అమాయకులను వలలో వేసుకొని, వారి నుంచి డబ్బులు గుంజే దళారుల పని పడతామని, అటువంటి మోసాలను సహించమని ధర్పల్లి తాసిల్దార్ మాలతి బుధవారం పత్రికా సమావేశంలో,దళారులను హెచ్చరించారు. రేషన్ కార్డ్ ఇప్పిస్తామని ,డబుల్ బెడ్ రూమ్ ఇప్పిస్తామని , ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై నిగా పెట్టి, కేసులు నమోదు చేస్తామన్నారు. దళారుల పట్ల లబ్ధిదారుల ప్రమాదంగా ఉండాలని, ఏదైనా అవసరం ఉంటే నేరుగా మీసేవ ద్వారా లేదా సంబంధిత శాఖ అధికారుల ద్వారా తెలుసుకొని దాన్ని అనుసరించాలని ఆమే సూచించారు. ఎటువంటి పథకాలు అయినా నేరుగా లబ్ధిదారులకు అందాలంటే ప్రభుత్వానికి సంబంధించిన వెబ్సైట్ ద్వారా, వాటిని దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దళారులను నమ్మితే డబ్బులు దండిగే తప్ప పనులు కాదన్నారు. దళారుల పట్ల, మోసకారుల పట్ల,లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

# రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన



**చట్టం మెదక్ ప్రతినిధి :** రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన కొనసాగుతుందని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. బుధవారం శాసనసభ్యులు నియోజకవర్గ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శంకరంపేట గవలపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మెదక్ ఆర్డీవో రమాదేవి, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో కలిసి ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి 202425 వరి పంట కోనుగోలు నిమిత్తం ధాన్యము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పిలుపు నిచ్చారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూకేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 నిర్ణయించినందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సీజ్ చేసిన తహసిల్దార్



**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఇటీవల కొంతమంది, ఇళ్ల తాళాలను పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించిన నేపథ్యంలో తాసిల్దార్ బుధవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు తాళాలు వేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇంకా పూర్తి కాలేవని చాలా పనులు మిగిలి ఉన్నాయని ,అసంపూర్తి ఇళ్లలోకి ఎవరు ప్రవేశించకూడదని అన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ పనులు పూర్తికాగానే నిజమైన లబ్ధిదారులను ఎమ్మెల్యే, కలెక్టర్ల ఆధ్వర్యంలో గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహ నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండలంలోని సీతయ్యపేట గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లను బుధవారం మండల ప్రత్యేక అధికారి ఎం. శ్రీనివాస్, అభివృద్ధి అధికారి బాలకృష్ణ ,కార్యదర్శి కృష్ణ కాంత్, లబ్ధిదారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం నిర్మించిన మోడల్ ఇల్లు ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే ప్రభుత్వం అందించే ఐదు లక్షల రూపాయలతో లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ఇల్లు నిర్మించుకోవచ్చు అని వారు సూచించారు.



# రేవంత్‌పై విశ్వాసం పోయింది

- **సొంత పార్టీ నేతల్లోనే గందరగోళం**
- **బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా.ఎన్.వి.ఎస్.ఎస్ కామెంట్స్**



**చట్టం, హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో విఫలమవుతోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా విశ్వాసం కోల్పోయిన దుస్థితి ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. సీఎల్పీ సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యల ద్వారా ఆయన నిరాశ, నిస్పృహ స్పష్టంగా ప్రతిఫలించిందని తెలిపారు. కేబినెట్ లో సమష్టి బాధ్యత లేకుండా ఒక్కో మంత్రి ఒక్కో మాట మాట్లాడడం, ముఖ్యమంత్రి తన అధికార పరిధిలోని నిర్ణయాలను కూడా అధిష్టానంపై నెట్టేసే తీరుతో వ్యవహరించడం, ఈ ప్రభుత్వం గందరగోళంలో, సంక్షోభంలో ఉన్నదన్న భావనకు బలం చేకూర్చుతోందని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా స్థితికి చేరుకోవడమే కాదు, శాంతిభద్రతలు, సంక్షేమం, పరిపాలన అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయనడానికి.. తాజా రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం గందరగోళంలో ఉందని, ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోందని చెబుతూనే... బీర్లు అమ్మాలి, భూములు అమ్మాలి, ఏఐ ద్వారా బూమ్ క్రియేట్ చేయాలి – అప్పుడే ప్రభుత్వ ఖజానా నిండేలా ఉందని కనిపిస్తోందన్న కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, వైఫల్య పాలనను ఎన్వీఎస్ ఎస్ ఎండగట్టారు. ఇక మంత్రివర్గ విస్తరణ విషయమై ముఖ్యమంత్రి – "అధిష్టానమే చూస్తోంది" అంటున్నారు. పీసీసీ నియామకాలు, కార్యవర్గ సభ్యుల ఎంపికతో పాటు, రాజకీయ, ప్రభుత్వ నియామకాలు కూడా అధిష్టానమే చూస్తోందని చెబుతున్నారు. ఇది రాజ్యాంగ సంక్షోభాన్ని, రాజకీయ సంక్షోభాన్ని సూచిస్తోందని గుర్తు చేశారు.

# సిటీలోకి మళ్లీ డ్రగ్స్



**హైదరాబాద్:** అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తో పాటు విదేశీ మద్యం బాటిళ్లను తెలంగాణ ఎస్టీఎఫ్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి చెప్పారు. స్కోడా కారు, గంజాయి, సింథటిక్ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ‘‘కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద బైక్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. స్కోడా కారులో మరో వ్యక్తి ఓజీ కుష్ డ్రగ్స్‌ను మార్పిడి చేసుకునే సమయంలో ఎస్టీఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీలు చేయగా.. 500 గ్రాముల ఓజీ కుష్ డ్రగ్, కేజీ గంజాయి, 6 గ్రాముల చరస్, 4.38 గ్రాముల సింథటిక్ డ్రగ్స్‌తో పాటు 5 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాం. ఇద్దరు నిందితులు ప్రతీష్ బట్, జైసూర్యలను అరెస్టు చేశాం’’ అని ఖురేషి తెలిపారు.

# జడ్పీ పనులకు మోకాలడ్డు



**చట్టం, విశాఖపట్నం:** జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న పనులకు లేని ఇబ్బంది ఎలమంచిలి నియోజకవర్గంలో వస్తున్నదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు చేయనివ్వకుండా స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖపై చర్చ జరిగినప్పుడు పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ, ఎలమంచిలి నియోజకవర్గంలో జడ్పీ నిధులతో పనులు జరగడంలేదని సహచర సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని దీనిపై చైర్‌పర్సన్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎలమంచిలి నియోజకవర్గంతోపాటు ఇతర మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చైర్‌పర్సన్ పోడియంను చుట్టుముట్టి నిరసనకు దిగారు. దీంతో చైర్‌పర్సన్ స్పందిస్తూ ‘ఎలమంచిలి’లో నిధుల వ్యయంపై గతంలో ఒకసారి సభ్యులు ప్రస్తావించారని గుర్తుచేశారు. అప్పట్లో అధికారులకు ఆదేశాలు ఇచ్చినా.. ఇంత వరకు సమస్య పరిష్కారంకాలేదని అన్నారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, పనులు జరిగేటట్టు ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో సభ్యులు శాంతించారు. సమావేశం ప్రారంభంకాగానే కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు పాటించనందునే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అన్ని బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దారు, ఎస్ఐ, ఎంపీడీవోల నేతృత్వంలోని కమిటీ ప్రతి నెల తనిఖీచేస్తే భవిష్యత్తులో ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. బాణసంచా ప్రమాదంతోపాటు ఫార్మా, ఇతర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు చెల్లించే పరిహారంలో వ్యత్యాసం వుంటున్నదని, దీంతో తగిన నష్టపరిహారం కోసం ఫార్మా కంపెనీల వద్ద బాధిత కుటుంబాలు ధర్నాలు చేస్తున్నాయని అన్నారు. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు ఒకే విధమైన పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం ఒక విధానం రూపొందించాలని కోరుతూ జడ్పీ తీర్మానం చేయాలని కోరారు. ఇందుకు సమావేశం ఆమోదించింది. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ, పరవాడ ఫార్మాసిటీలోని పలు కంపెనీల నుంచి విడుదలయ్యే విషవాయువులతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని నివారించడానికి ఆయా కంపెనీలు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.

# వైసీపీ కుట్రలను ప్రజలు నమ్మరు



**చట్టం, ఎమ్మిగనూరు:** రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ, మాజీ సీఎం జగన ప్రాం తాల, మతాల, కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు చేస్తున్నారని, ప్రజలు వీటిని నమ్మరని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు దాదాపు 2వేల మందికి పైగా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బీవీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కోఆప్షన మెంబర్ హసీనా, ఆమె భర్త గట్టు ఖాజా, వైసీపీ నాయకులు, ప్రముఖ సామజిక వేత్త మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు ఆయన అనుచరులు, వైసీపీకి చెందిన నంబూరి సురేష్‌తో పాటు మరి కొందరు, తెలుగురాముడు ఆయన అనుచరులు, టౌన బ్యాంకు మాజీ డైరెక్టర్ శ్రీరాములు, పాత పదకొండో వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ లచ్చన్న, వైసీపీ నాయకులు వెంకటేష్, రవి, ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు కదిరికోట అనిల్ కుమార్, కదిరికోట శాంతరాజు, ఎంఎస్ నగర్‌కు చెందిన ఎంఆర్ మోహన, మాల రాజేష్‌లతో పాటు వారి అనుచరులు పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు శ్రీరాములు, టీడీపీ నాయకులు రామదాసు గౌడ్, నరసింహులు, కాశీం వలి, ధర్మాపురం గోపాల్, కురువ మల్లయ్య, ముల్లా కలీముల్లా, రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, అల్తాఫ్, రాజు, మహేష్, షాలేమ్, జయన్న, నరసన్న గౌడ్, కొండన్న గౌడ్, గుల్లా సలాం, కటారి రాజేంద్ర పాల్గొన్నారు.

# మాధవరం పోలీసు స్టేషనలో అన్నదాత ఫిర్యాదు



**చట్టం, మంత్రాలయం:** మంత్రాలయం మండలంలోని పరమానదొడ్డి గ్రామానికి చెందిన రైతులు సుగాలి పరమేష్‌నాయక్, సుగాలి గణపతినాయక్ నకిలీ విత్తనాలతో మోసపోయారు. గత ఐదు నెలల క్రితం యూపీఎల్ కంపెనీకి చెందిన వగరూరు సీడ్ ఆర్గనైజర్ వద్ద 8.50 ఎకరాలకు మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి తమ పొలంలో నాటారు. పంట ఏపుగా పెరిగింది. కాయ వచ్చేసరికి కాయలో విత్తనాలు లేకపోవడంతో రైతు లు అవాక్కయ్యారు. వెంటనే సీడ్ ఆర్గనైజర్‌కు, వ్యవసాయా ధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం నంద్యాల సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డా. రామకృష్ణరావు, డా. వెంకటరమణ, సీనియర్ ప్లాంట్ రీడింగ్ అధికారి డా. సుజాతమ్మ, మండల వ్యవసాయాధికారి జీర గణేష్ పంటను పరిశీలించారు. పంట చేతికందే సమయంలో మొక్కకు ఉన్న కంకిలో విత్తనాలు లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. రైతులు వినియోగించిన మందులు, భూమి స్వభావం విచారించి నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. ఇందులో పరమేష్‌నాయక్ మూడెకరాలు, గణపతి నాయక్ 5.50 ఎక రాలో సాగు చేసి దాదాపు 8.50 లక్షల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలుకు తీసుకుని సాగు చేసుకున్న గిరిజన రైతులకు న్యాయం చేయాలని మాధవరం పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేశారు. ఈ పరిశీలనతో వీఏఏలు రాజేశ్వరి, లలిత, రైతులు పాల్గొన్నారు.

# స్కానింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి



**చట్టం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై కఠినచర్యలు తీసుకోవాలని, నిరంతరం స్కానింగ్ కేంద్రాల పనితీరును పర్యవేక్షించాలని వైద్య అరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి జిల్లా వైద్య అరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షించాలని భ్రూణ హత్యలు జరగకుండా పకడ్బందీగా చర్యలుతీసుకోవానలి అన్నారు. పీసీ ఎన్‌బీ యాక్ట్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా సలహా కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధికం గా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధార ణ ప్రసవాలను ప్రొత్సహించాలని, అత్యవసర సమయంలోనే సీ సెక్షన్ అపరేషన్లు నిర్వహించాలన్నారు. జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పా టుకు రిజిస్ట్రేషన్ పక్రియ కలెక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే జరగాలన్నా రు. నూతన స్కానింగ్ కేంద్రాలు, పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు కమిషనర్ అనుమతి తప్పనిసరి అని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది మందుల కోరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరాలకు అనుగుణంగా స్పెషలిస్ట్ డాక్టర్లను ఎప్పటికప్పుడు నియ మించుకోవాలని, వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులు ప్ర భుత్వం వద్ద ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందు బాటులో ఉన్న మందుల వివరాలను వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలని అన్నారు. అందుబాటులో ఉన్న మందులను మాత్రమే రోగులకు అందించాలని రోగులు అనవసరంగా ప్రైవేటుగా మందులు కోనాల్సిన అవసరం రావద్దని అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీ డయాగ్నోస్టిక్, టీ హాబ్ వివరాలు తెలుసుకున్నారు. డయాగ్నోస్టిక్ కేంద్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి పరీక్షల నివేదికలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రజిత, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పెంచలయ్య, ప్రోగ్రాం అధికారు లు పాల్గొన్నారు.

# పెదబొడ్డేపల్లిలో దొంగలు హల్‌చల్

- **సింహాచలం ఇంట్లో పగలగొట్టిన బీరువా**
- **ఒకే ప్రాంతంలో తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లల్లో చోరీలు**
- **9.5 తులాల బంగారం, 42 తులాల వెండి అపహరణ**



**చట్టం, నర్సీపట్నం:** మునిసిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లిలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసి వున్న మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తొమ్మిదిన్నర తులాల బంగారం, 42 తులాల వెండి, కొంత నగదును అపహరించుకుపోయారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదబొడ్డేపల్లి థెరెసా కాలనీలో ఎం.సింహాచలం, భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. సింహాచలం ఆరోగ్యం బాగోలేక పోవడంతో శనివారం అందరూ కలిసి విశాఖలో ఆస్పత్రికి వెళ్లారు. పై అంతస్థులో అద్దెకు ఉంటున్న గ ణేశ్ బుధవారం ఉదయం సింహాచలం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి అతని కుమారుడు సత్యసార ఉథికి ఫోన్ చేశారు. వారు వెంటనే ఇంటికి తిరిగి వచ్చి చూడగా పడక గదిలోని బీరువా తెరిచి దుస్తులు చెల్లాచెదురుగా పడి వున్నాయి. ఏడు తులా ల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే వీధిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బత్తిన సత్యనారాయణ నివాసం వుంటున్నారు. ప్రస్తుతం రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీలో పనిచేస్తున్నారు. వారానికి ఒకసారి ఇంటికి వచ్చి వెళుతుంటారు. ఆయన భార్య భవానీ శనివారం అత్త వారి ఊరైన కోటవురట్ల మండలం పందూరులో పండక్కి వెళ్లారు. బుధవారం ఉదయం తలుపులు తెరిచి ఉండడాన్ని ఎదురింటావిడ గమనించి భవానీకి సమాచారం ఇచ్చారు. ఆమెకు దగ్గర బంధువు నాగేశ్వరరావు 100కు ఫిర్యాదు చేయగా. పోలీసులు వచ్చి విచారణ చేశారు. రెండున్నర తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు బాధితులు చెప్పారు. పెదబొడ్డేపల్లి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న రామ్‌నగర్ కాలనీలో వైజాగ్ ఎయిర్ పోర్టులో సెక్యూరిటీ విభాగంలో ఎస్ఐ కేడర్ అధికారిగా పని చేస్తున్న అడిగర్ల శ్రీరామమూర్తి నివాసం వుంటున్నారు.

# విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసం అవసరం



**చట్టం, సీతానగరం:** విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసం కలిగే విధంగా గురువులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఉపాధ్యాయులను కోరా రు. బుధవారం మండలంలోని వెదుళ్లపల్లిలోని ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన కాంపౌండ్ వాల్, సత్య బొల్లీస్ సైన్స్ ల్యాబ్, డై నింగ్ హాల్‌లను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరిలతో కలసి ఆమె ప్రారంభించారు. దాత బొల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పురందేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుతం విద్య అంటే క్లాస్ రూమ్‌లు, మెడల్స్, ర్యాంకులు అను కుంటున్నారని, విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సమాజం పట్ల బాధ్యత, దేశభక్తి విస్మరిస్తున్నారన్నారు. కొంత మంది గురువుల వెర్రి పోకడలు చూ స్తుంటే తల్లిదండ్రులు ఆందోళన కలిగించే పరిస్థితులు ఉన్నాయన్నారు. గురువులు తరగతి గదుల్లో పాఠ్య పుస్తకాల్లో ఉన్న వాటిని మాత్ర మే చెప్పి వదిలేయకుండా సామాజిక స్పృహ కల్గించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, తనకాల నాగేశ్వరరావు, మండ లాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, వలవల రాజా, మట్ట వె ంకటేష్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001.,
and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com